మిషన్ భగీరథ కార్మికుల సమ్మె ఉద్ధృతి

కూసుమంచి: వేతన బకాయిలు చెల్లించాలంటూ పాలేరు మిషన్ భగీరథ పథకం కార్మికులు బుధవారం చేపట్టిన సమ్మె జిల్లాలోని పలు ప్రాంతాలకు విస్తరించింది. ఎల్అండ్‌టీ నిర్వహణ పరిధిలోని పలు పథకాల్లో పనిచేస్తున్న 460మంది కార్మికులు సమ్మెబాట పట్టారు. పాలేరు జలాశయం పరిధిలోని కూసుమంచి, నేలకొండపల్లి, ఖమ్మం గ్రామీణం, తిరుమలాయపాలెం, రఘునాథపాలెం మండలాల కార్మికులు విధులు బహిష్కరించడంతో 308 ఆవాస ప్రాంతాలకు నీటి సరఫరా నిలిచిపోయింది. మూడు నెలల వేతనాలు పెండింగ్‌లో ఉన్నాయని, బకాయిలు చెల్లిస్తేనే విధుల్లోకి చేరతామని కార్మికులంటున్నారు. సంస్థ ప్రతినిధులు ఒక నెల వేతనం ఇచ్చేందుకు ముందుకు రాగా తిరస్కరించినట్లు కార్మికుల సంఘం నాయకుడు పుల్లారెడ్డి చెప్పారు.

'మార్కెట్‌ను అన్ని వసతులతో తీర్చిదిద్దుతాం'

ఖమ్మం గ్రామీణం: మూడు, నాలుగు నెలల్లో మద్దులపల్లి మార్కెట్ పనులను పూర్తిచేసి అన్ని వసతులతో అందుబాటులోకితీసుకొస్తామని మంత్రులు తుమ్మల నాగేశ్వరరావు, పొంగులేటి శ్రీనివాసరెడ్డి హామీ ఇచ్చారు. మార్కెట్ పాలకవర్గ ప్రమాణ స్వీకారోత్సవాన్ని మార్కెట్ నిర్మాణ స్థలంలో గురువారం నిర్వహించారు. ఈ సందర్భంగా మంత్రులు మాట్లాడుతూ నూతన పాలకవర్గ హయాంలోనే మార్కెట్‌ను అభివృద్ధి చేస్తామన్నారు. ఈ ప్రాంతంలో గోదాములు, కోల్డ్ స్టోరేజీలను ఏర్పాటుచేసి జిల్లాలోనే ఎక్కువ మంది రైతులు వినియోగించుకునేలా తీర్చి దిద్దుతామన్నారు. నిర్మాణానికి రూ.20 కోట్లు కేటాయించినట్లు వివరించారు. ఖమ్మం మార్కెట్ బాగా ఓవర్‌లోడ్ అయిందని, రైతులకు ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా పాలకవర్గ సభ్యులు చర్యలు చేపట్టాలన్నారు. మార్కెట్ కమిటీ ఛైర్మన్‌గా బైరు హరినాథబాబు, పాలకవర్గ సభ్యులు ప్రమాణ స్వీకారం చేశారు. గిడ్డంగుల సంస్థ ఛైర్మన్ రాయల నాగేశ్వరరావు, మాజీ ఎమ్మెల్సీ బాలసాని లక్ష్మీనాయకురాలు, స్వర్ణకుమారి, నరేశ్, చరణ్‌రెడ్డి, వెంకటరెడ్డి, మల్లారెడ్డి, మౌలానా, సురేశ్ పాల్గొన్నారు.



మాట్లాడుతున్న మంత్రి పొంగులేటి, చిత్రంలో మంత్రి తుమ్మల తదితరులు

ఆడిన వారికి ఉయ్యాలో.. పాడిన వారికి ఉయ్యాలో..



ఖమ్మం: బతుకమ్మను పూజిస్తూ..













ముదిగొండ మండలం వల్లభిలో ఆడుతున్న మహిళలు, యువతులు

తొమ్మిది రోజుల పాటు ఆనందోత్సాహాల నడుమ సాగిన వేడుకలకు మహిళలు, యువతులు, చిన్నారులు సద్దుల బతుకమ్మతో ముగింపు పలికారు. అమ్మవారికి పెరుగన్నం, చింతపండు పులిహోర, నిమ్మకాయ అన్నం, కొబ్బరి అన్నం, నువ్వుల అన్నం వండి నైవేద్యంగా సమర్పించారు. చివరి రోజు సాయంత్రం వాడవాడలా విరుల వేడుకలను అంగరంగ వైభవంగా జరుపుకొన్నారు. ఉదయం నుంచి మహిళలు, యువతులు, చిన్నారులు తీరొక్క పూలను సేకరించి బతుకమ్మలను అందంగా పేర్చారు. సాయంత్రం పూట కూడళ్ల వద్దకు చేరుకొని "బతుకమ్మ.. బతుకమ్మ ఉయ్యాలో.. బంగారు బతుకమ్మ ఉయ్యాలో.." అంటూ ఆడిపాడారు. అనంతరం స్థానిక చెరువుల్లో బతుకమ్మలను నిమజ్జనం చేశారు.

– ఖమ్మం సాంస్కృతికం, న్యూస్‌టుడే





ఖమ్మం మున్నేరు వద్ద కోలాహలం



సెల్ఫీ తీసుకుంటూ..



ఖమ్మం: చంటి పిల్లతో..



తల్లాడలో భారీ బతుకమ్మ



నిమజ్జనం చేస్తూ..





నృత్యాలతో సంబరాలు



ఏన్కూరులో ..



సత్తుపల్లిలో వేడుకల్లో పాల్గొన్న ఎమ్మెల్యే రాగమయి



ఖమ్మం మున్నేరు వద్ద ఆటాపాటా..

పండుగ నాటికి పరిహారం డబ్బులు

ఖమ్మం వ్యవసాయం, న్యూస్‌టుడే

ఖమ్మం, భద్రాద్రి జిల్లాల్లో భారీ వర్షాలు, వరదలతో పంట నష్టపోయిన రైతులకు ప్రభుత్వం నష్ట పరిహారం(ఇన్‌పుట్ సబ్సిడీ) మంజూరు చేసింది. ఎకరానికి రూ.10 వేల చొప్పున రైతులకు చెల్లించనుంది. రాష్ట్రంలోనే అత్యధికంగా ఖమ్మం జిల్లాలో పంటలకు నష్టం వాటిల్లింది. పత్తి, వరి, మిరప, తదితర పంటలు దెబ్బతిన్నాయి. ఆగస్టు 31 నుంచి సెప్టెంబరు 6 మధ్య కురిసిన భారీ వర్షాల కారణంగా ఖమ్మం జిల్లాకు అత్యధిక నష్టం జరిగింది. ఖమ్మం జిల్లాలోని 21 మండలాల్లో నష్టం వాటిల్లినా అత్యధికంగా ఖమ్మం గ్రామీణం, ముదిగొండ, కూసుమంచి, ఎర్రుపాలెం, మధిర, నేలకొండపల్లి, తిరుమలాయపాలెం మండలాల్లో పంటలు దెబ్బతిన్నాయి. భద్రాద్రి కొత్తగూడెం జిల్లాలోని బూర్గంపాడు, అశ్వాపురం, మణుగూరు, పాల్వంచ మండలాల్లో ఎక్కువ నష్టం జరిగింది. మున్నేరు పరీవాహక ప్రాంతం, పాలేరు, ఆకేరు ప్రాంతాల్లో వరద ఉద్ధృతి ఎక్కువగా ఉండటంతో పంటలు పూర్తిగా దెబ్బతిన్నాయి. కేంద్ర బృందం సభ్యులు, మంత్రులు పరిశీలించారు. వ్యవసాయ విస్తరణాధికారులు నష్టం అంచనా వేయాలని రాష్ట్ర వ్యవసాయశాఖ ఆదేశించింది.

జిల్లాల వారీగా..

	ఖమ్మం	భద్రాద్రి
ఎకరాలు	28,407.04	2,656.15
రైతులు	27,241	2,148
పరిహారం(రూ.కోట్లలో)	28.40	2.65

ఉద్యాన పంటలు

ఖమ్మం జిల్లాలో 6,102 ఎకరాల్లో ఉద్యాన పంటలు సాగు చేయగా 3,287.9 ఎకరాల్లో పంటలు దెబ్బతిన్నాయి. అత్యధికంగా మిరప 3,032.24 ఎకరాల్లో నష్టపోయింది. ఖమ్మం గ్రామీణం, మధిర, తిరుమలాయపాలెం, ఎర్రుపాలెం మండలాల్లో నష్టం వాటిల్లింది. ఇందు కోసం ప్రభుత్వం రూ.3.28 కోట్ల పంట నష్టపరిహారం మంజూరు చేసినట్లు జిల్లా ఉద్యాన, పట్టు పరిశ్రమ శాఖ అధికారి ఎంవీ మధుసూదన్ తెలిపారు.



మధిర మండలంలో దెబ్బతిన్న పంటలు ఏఈఓకు చూపిస్తున్న రైతులు (పాత చిత్రం)

పంట నష్టపోయిన రైతులకు ప్రభుత్వం పరిహారం మంజూరు చేసింది. బిల్లులను తయారుచేసి ఖజానా శాఖకు సమర్పించాం. ప్రభుత్వం నుంచి అనుమతి రాగానే ఒకట్రెండు రోజుల్లో రైతుల ఖాతాల్లో డబ్బులు జమవుతాయి.

–దనసరి పుల్లయ్య, డీఏఓ

ప్రాథమిక పాఠశాలలో వంట తయారీపై వివాదం

సత్తుపల్లి: సెలవు దినాల్లో సత్తుపల్లిలోని పాత సెంటర్ ప్రాథమిక పాఠశాలలో మధ్యాహ్న భోజన కార్మికులు వంటలు చేసిన దృశ్యాలు సామాజిక మాధ్యమాల్లో వైరల్‌గా మారాయి. పాఠశాల హెచ్ఎం చిత్తలూరి ప్రసాద్ తల్లి వీరమ్మ మృతి చెందిన నేపథ్యంలో 20మందికి వంటలు చేయమని చెప్పడంతో బుధవారం తాము ఈపనికి పూనుకున్నామని కార్మికులు వీడియోలో చెప్పుకొచ్చారు. ఈ విషయంపై ఎంఈఓ నక్కా రాజేశ్వరరావు మాట్లాడుతూ ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు హెచ్ఎం చిత్తలూరి ప్రసాద్‌కు షోకాజ్ నోటీసు అందించామని తెలిపారు. ఆయన్ని కొణిజర్ల హరిజనవాడ ప్రాథమిక పాఠశాలకు డిప్యుటేషన్ వేస్తూ డీఈఓ ఉత్తర్వులు విడుదల చేశారన్నారు. హెచ్ఎం ప్రసాద్ మాట్లాడుతూ తన తల్లి మృతి చెందగా ఇంటివద్దే ఉన్నానని, బడిలో జరిగిన దానికి తనకు సంబంధం లేదని సమాధానమిచ్చారు. మధ్యాహ్న భోజన కార్మికురాలు కృష్ణవేణి మాట్లాడుతూ నేషనల్ క్రిస్టియన్ కౌన్సిల్ బాధ్యుడు వంట చేయమని చెప్పడంతో చేసేందుకు ప్రయత్నించినట్టు, ఇందులో హెచ్ఎం ప్రమేయం లేదని పేర్కొన్నారు.

కిడ్నాప్ ముఠా అరెస్టు

ముదిగొండ: డబ్బుల కోసం కిడ్నాప్ చేసిన ముఠాను పట్టుకున్నట్లు ముదిగొండ సీఐ మురళి గురువారం తెలిపారు. గంధసిరికి చెందిన పస్తం ఏసురాజు, పస్తం రామరాజు మధ్య పాతకక్షలు ఉన్నాయి. ఏసురాజును కిడ్నాప్ చేసి డబ్బులు వసూలు చేయాలని రామరాజు పథకం వేశాడు. ఏసురాజును కిడ్నాప్ చేయాలంటూ వెంకటగిరికి చెందిన దగ్గుపాటి రమాదేవికి రూ.50వేలు అడ్వాన్స్‌గా ఇచ్చాడు. రమాదేవి తన అనుచరులైన కంచర్ల నాగేశ్వరరావు, దాసరి రమేశ్‌కు విషయం తెలపగా వారు వాసికర్ణ సాయికృష్ణ, కమతం వినీత్‌తో మాట్లాడి వీరంతా ముఠాగా ఏర్పడి కిడ్నాప్‌నకు ప్రణాళిక వేశారు. కంచర్ల నాగేశ్వరరావు, దాసరి రమేశ్‌కు అడ్వాన్సుగా రూ.50 వేలు ఇచ్చి పని పూర్తయ్యాక అడిగినంత నగదు ఇస్తానని రామరాజు చెప్పాడు. గత నెల 25వ తేదీ రాత్రి ఏసురాజు, అంజయ్య, మరికొందరు కారులో కమలాపురం నుంచి గంధసిరి వస్తుండగా రామరాజుతోపాటు కంచర్ల నాగేశ్వరరావు, దాసరి రమేశ్, వాసికర్ణ సాయికృష్ణ, కమతం వినీత్, పలిమెల ప్రవీణ్ కలిసి గంధసిరి సమీపంలోని మావూళ్లమ్మ దేవాలయం దగ్గర ఏసురాజు కారును ఆపి బలవంతంగా వేరే కారులోకి ఎక్కించుకుని ఖమ్మంలోని కొత్తబస్టాండ్ వద్దకు తీసుకెళ్లాడు. రూ.లక్ష ఇస్తే వదిలిపెడతామని, లేకుంటే చంపుతామని బెదిరించారు. ఏసురాజు భయపడి కంచర్ల నాగేశ్వరరావు ఫోన్‌కు రూ.60వేలను ఫోన్‌పే ద్వారా పంపించి మిగిలిన నగదును రెండు రోజుల్లో ఇస్తానని చెప్పటంతో ఏసురాజును బస్టాండ్‌లో వదిలేశారు. కిడ్నాప్ ఘటన పూర్తయ్యాక రామరాజు రూ.50వేలు నగదు ఇచ్చాడు. ఏసురాజును కిడ్నాప్ చేసిన వారు బెదిరించటంతో రెండుసార్లు రూ.16,500 నగదు ఫోన్‌పే ద్వారా పంపించాడు. ఈనెల 8న ఏసురాజు ఈ ఘటనపై పోలీసులకు ఫిర్యాదు చేశాడు. సీఐ మురళి రెండు టీమ్‌ల సాయంతో సువర్ణాపురం వద్ద జాతీయ రహదారిపై వాహనాలు తనిఖీ చేస్తుండగా పస్తం రామరాజు, దగ్గుపాటి రమాదేవి, కంచర్ల నాగేశ్వరరావు, దాసరి రమేశ్, వాసికర్ణ సాయికృష్ణ, కమతం వినీత్, పలిమెల ప్రవీణ్, గంధం అంజయ్య అనే ఎనిమిది మంది కార్లలో పారిపోతూ పట్టుబడ్డారు. వీరి నుంచి 10సెల్‌ఫోన్‌లు, మూడు కార్లు స్వాధీనం చేసుకుని రిమాండ్‌కు తరలించినట్లు సీఐ తెలిపారు. ఈ ముఠా గతంలో తొర్రూర్ ఏరియాలో ఇటువంటి నేరాలు చేసిందని తెలిపారు.

అనాథ పిల్లలతో ఐఏఎస్‌లు

ఖమ్మం కమాన్‌బజార్: విద్యతోనే భవిష్యత్తు ఉంటుందని.. బాగా చదువుకొని ఉన్నత స్థానానికి ఎదగాలని కలెక్టర్ ముజమ్మిల్‌ఖాన్ అన్నారు. ఖమ్మంలోని బాలల సదనం పిల్లలతో కలిసి కలెక్టర్ ముజమ్మిల్‌ఖాన్, అదనపు కలెక్టర్ శ్రీజ, శిక్షణ కలెక్టర్ మృణాల్ శ్రేష్ఠ నగరంలోని కావేరి రెస్టారెంట్‌లో బుధవారం రాత్రి విందు ఆరగించారు. కలెక్టర్ మాట్లాడుతూ.. అనాథ అనే భావన తొలగించుకొని ఇతర పిల్లల మాదిరిగానే అన్నిరంగాల్లో రాణించేందుకు అవకాశాలను అందిపుచ్చుకోవాలని సూచించారు.



బాలల సదనం పిల్లలతో కలిసి భోజనం చేస్తున్న కలెక్టర్ ముజమ్మిల్‌ఖాన్, తదితరులు

33 మంది పంచాయతీ కార్యదర్శులు బదిలీ

ఖమ్మం నగరం: జిల్లావ్యాప్తంగా 33 మంది పంచాయతీ కార్యదర్శులు బదిలీ కానున్నారు. ఇందుకు సంబంధించిన దస్త్రంపై అదనపు కలెక్టర్ పొడిశెట్టి శ్రీజ సంతకం చేశారు. కలెక్టర్ ఆమోదం లాంఛనమే. గత నెలలో ఒకేరోజు 387 మంది పంచాయతీ కార్యదర్శులను కలెక్టర్ ముజమ్మిల్‌ఖాన్ బదిలీ చేశారు. ఇందులో పలువురు ఆరోగ్య సమస్యలు, భార్యాభర్తలు(స్పౌజ్ కేస్) సమీపంలో ఉండేలా, చంటి పిల్లల తల్లులు తదితర కారణాలతో తమకు బదిలీ చేయాలని కలెక్టర్‌ను కలిసి విజ్ఞప్తి చేశారు. దరఖాస్తులు పరిశీలించిన డీపీఓ ఆశాలత నాలుగు రోజుల క్రితం కౌన్సిలింగ్ నిర్వహించి వారు కోరుకున్న పోస్టింగ్‌లు కేటాయిస్తూ అదనపు కలెక్టర్‌కు దస్త్రం పంపారు. ఈ బదిలీల్లో నిబంధనలు పాటించడం లేదనే ఆరోపణలు వినిపిస్తున్నాయి. జిల్లా పంచాయతీ అధికారి ఆశాలతను 'న్యూస్‌టుడే' సంప్రదించగా అనారోగ్యం, స్పౌజ్ కేసులను పరిగణనలోకి తీసుకుని బదిలీ చేయాలని కలెక్టర్ సూచించినట్లు తెలిపారు. బదిలీల్లో ఏవైనా పొరపాట్లు జరిగినట్లు తమ దృష్టికి వస్తే సవరించి, నిబంధనలు పాటిస్తామన్నారు.

రేషన్ కార్డులందక పరేషాన్!

ఖమ్మం నగరం, న్యూస్‌టుడే

కాంగ్రెస్ ప్రభుత్వం నూతన రేషన్ కార్డులు ఇవ్వాలని నిర్ణయం తీసుకుంది. అక్టోబరు 2 నుంచి దరఖాస్తులు స్వీకరిస్తామని ప్రకటించింది. తీరా అది రద్దు కావడంతో వేలమంది అర్హులు నిరాశ చెందారు. జిల్లాలో ఎంపిక చేసిన నాలుగు మున్సిపల్ వార్డులు, ఆరు పంచాయతీల్లో 'ఫ్యామిలీ డిజిటల్ కార్డుల సర్వే' చేపట్టారు. ఈ పైలెట్ ప్రాజెక్టు 8వ తేదీతో ముగిసింది. దీని తరువాతైనా దరఖాస్తులు స్వీకరిస్తారేమోనని అర్హులు ఆశగా ఎదురుచూస్తున్నారు.

- జిల్లాలో గడిచిన పదేళ్లలో జారీ చేసిన కార్డుల సంఖ్య కేవలం 12,216 మాత్రమే. అదీ ప్రింట్ తీసుకోవడం తప్ప భౌతికంగా కార్డులు ఇవ్వలేదు. 2017 నుంచి 67,913 మంది పేర్లు రేషన్ కార్డుల్లో నమోదు చేయాలని 48,113 దరఖాస్తులు ఇవ్వగా అవన్నీ పెండింగ్‌లో ఉన్నాయి. 2021 నుంచి ఆన్‌లైన్ దరఖాస్తు విధానాన్ని హోల్డ్‌లో ఉంచారు. 2023 డిసెంబరు 26 నుంచి 2024 జనవరి 6 వరకు ప్రజా పాలన పేరిట ఆన్‌లైన్ చేసిన దరఖాస్తుల్లో ఎక్కువ రేషన్ కార్డులకు సంబంధించినవే ఉన్నాయి. వీటికీ మోక్షం లభించలేదు.
- మరణించిన వారి పేర్లు కార్డుల్లో వాటంతట అవే తొలగిపోయేలా సాఫ్ట్‌వేర్ ఏర్పాటు చేశారు. కానీ కొత్తగా జన్మించిన వారి పేర్లు మాత్రం చేర్చడం లేదు. ఉమ్మడి కుటుంబాలు వేరు సంసారం పెట్టినా కొత్త కార్డులు ఇవ్వడం లేదు.



	మొత్తం కార్డులు	లబ్ధిదారులు
2022 ఫిబ్రవరి	4,16,812	11,68,535
2022 అక్టోబరు	4,12,881	11,44,600
2024 జూన్	4,11,251	11,31,039
2024 అక్టోబరు	4,11,188	11,29,741

కొత్త రేషన్ కార్డులు ఇవ్వాలని ప్రభుత్వం ఆదేశిస్తే వెంటనే ప్రక్రియ చేపడతాం. ఇందుకు సంబంధించి మార్గదర్శకాలు రాలేదు. కార్డుల్లో పేరు నమోదుకు అందిన దరఖాస్తులు వివిధ స్థాయిల్లోని అధికారుల లాగిన్‌లో పెండింగ్‌లో ఉన్నాయి. వాటిని పరిష్కరించమని ఉన్నతాధికారుల నుంచి ఆదేశాలు రాలేదు. మీసేవ కేంద్రాల్లో వెబ్‌సైట్ క్లోజ్ చేశారు.

చందన్‌కుమార్, డీఎస్ఓ


పేరు నమోదుకు మండలాల వారీగా అందిన దరఖాస్తులు

బోనకల్లు-1853, చింతకాని-2047, ఏన్కూరు-1237, కల్లూరు-2681, కామేపల్లి-1335, ఖమ్మం అర్బన్- 7852, ఖమ్మం రూరల్- 2194, కొణిజర్ల- 1722, కూసుమంచి-2055, మధిర-2729, ముదిగొండ-2040, నేలకొండపల్లి-2154, పెనుబల్లి-2127, రఘునాథపాలెం-1894, సత్తుపల్లి-3127, సింగరేణి-1686, తల్లాడ-1848, తిరుమలాయపాలెం-2062, వేంసూరు-1529, వైరా-1777, ఎర్రుపాలెం-2164.

రతన్ టాటాతో ఖమ్మానికి అనుబంధం

ఖమ్మం క్రీడలు, న్యూస్‌టుడే

పారిశ్రామిక మేరు నగధీరుడు రతన్ టాటా ఇక లేరు అన్న సమాచారంతో ఖమ్మం జిల్లాలో విషాదం నెలకొంది. ఆయనకు జిల్లాతో అనుబంధం ఉంది. గతంలో ఖమ్మం నగరానికి వచ్చి ఇక్కడి వ్యాపార సముదాయాల్లో కొంత సమయం గడిపారు. వ్యాపారులతో మాట్లాడిన అనుభవాలు ఉన్నాయి. 1983లో నాటి నెల్కో రేడియోను పరిచయం చేసే కార్యక్రమంలో పాల్గొనేందుకు ఆయన నాటి వ్యాపార భాగస్వామి దివంగత కాళ్ల వెంకటరామారావు ఇంటికి వచ్చారు. అక్కడే బస చేసి వచ్చిన పని పూర్తి చేసుకున్నారు. రతన్ టాటా తమ ఇంటికి వచ్చిన సందర్భాన్ని కమాన్‌బజార్‌లోని కాళ్ల కుటుంబ సభ్యులు, ఇక్కడి వ్యాపారులు గుర్తు చేసుకున్నారు. రతన్ టాటాకు శ్రద్ధాంజలి ఘటించారు. విలువలతో కూడిన వ్యాపారం చేసిన ఆయన దేశానికి అందించిన సేవలు వెలకట్టలేనివని కొనియాడారు.



ఖమ్మం: కమాన్‌బజార్లోని కాళ్ల ఏజెన్సీ వ్యాపార సముదాయంలో రతన్ టాటా

30 ఏళ్లక్రితం భద్రాచలంలో..

భద్రాచలం, న్యూస్‌టుడే: భద్రాచలం శ్రీసీతారామ చంద్రస్వామి దేవస్థానంతో వ్యాపార దిగ్గజం రతన్‌టాటాకు గొప్ప అనుబంధం ఉంది. సుమారు 30 ఏళ్ల క్రితం ఆయన చేసిన ప్రతిపాదన కార్యరూపం దాల్చి ఉంటే భక్తులకు సకల సదుపాయాలు అందుబాటులోకి రావటంతో పాటు ఆలయ విస్తరణ మరోస్థాయిలో ఉండేదని స్థానికులు గుర్తుచేసుకుంటున్నారు. దక్షిణ అయోధ్యగా పేరుగాంచిన భద్రాచలం గురించి తెలుసుకున్న రతన్‌టాటా సుమారు మూడు దశాబ్దాల క్రితం తన బృందంతో ఇక్కడికి వచ్చారు. స్వామివారిని దర్శించుకొని ప్రత్యేక పూజలు చేశారు. ఆ రోజుల్లోనే ఆయనకు ఘనస్వాగతం లభించింది. క్షేత్ర విశిష్టతను తెలుసుకొని ఇక్కడ చేయాల్సిన అభివృద్ధి పనులపై దేవాదాయశాఖ అధికారులతో సమావేశమయ్యారు. కీలక అంశాలపై చర్చించారు. రామాలయం సంపూర్ణ అభివృద్ధికి ఎంత ఖర్చవుతుందో నివేదికలను అందిస్తే తామే ఆ పనులు చేసి నిర్మాణాలను అప్పగిస్తామనే ప్రతిపాదనను దేవస్థానం అధికారుల ముందు ఉంచినట్లు సమాచారం. భక్తులకు కల్పించే వసతి భవనాలే కాకుండా ఆలయ విస్తరణపైనా చర్చించినట్లు తెలిసింది. ఈ ప్రతిపాదనలను నాటి అధికారులు ఒప్పుకోలేకపోయారు. అప్పటి నిబంధనల ప్రకారం దాతలు ఎంత గొప్పవారైనా విరాళాలిస్తే.. ఆమొత్తంతో దేవస్థానమే వారి పేరిట నిర్మాణాలు చేపట్టేది. ఇదే విషయాన్ని రతన్‌టాటాకు ఆలయాధికారులు వివరించారు. అందుకే రతన్‌టాటా ప్రతిపాదనలు కార్యరూపం దాల్చలేదు. ఆ తర్వాతైనా వీటిపై రెండువైపులా చర్చలు సాగి ఉంటే రామాలయ అభివృద్ధికి ఆ రోజుల్లోనే ముందడుగు పడేదని భక్తులు గుర్తుచేసుకుంటున్నారు.

వ్యాపార దిగ్గజానికి నివాళి

రఘునాథపాలెం, న్యూస్‌టుడే: ప్రముఖ వ్యాపారవేత్త రతన్ టాటా ఎంతో మందికి మార్గదర్శకుడని రఘునాథపాలెం మండలం ఈర్లపూడి యూత్ నాయకుడు కుమ్మరి వెంకట కోటయ్య అన్నారు. యూత్ ఆధ్వర్యంలో గ్రామంలో రతన్‌టాటా ఫ్లెక్సీని ఏర్పాటు చేసి గురువారం నివాళులర్పించారు. దేశంలో వ్యాపారాలు విస్తరించడంతోపాటు, నిరుద్యోగ సమస్య పరిష్కారానికి ఆయన కృషి చేశారని కొనియాడారు. ఆయన మరణం దేశానికి తీరని లోటని అన్నారు. ఈ కార్యక్రమంలో రాంప్రసాద్, కృష్ణప్రసాద్, సందీప్, శ్రీనివాస్, పిచ్చయ్య, తదితరులు పాల్గొన్నారు.



ఈర్లపూడిలో రతన్ టాటాకు నివాళులర్పిస్తున్న యూత్ సభ్యులు

విద్యుదుత్పత్తి చేసేలా..
సొంత అవసరాలు తీర్చేలా..

అశ్వారావుపేట, న్యూస్‌టుడే

అశ్వారావుపేట పామాయిల్ పరిశ్రమలో రూ.36 కోట్లతో నిర్మించిన ఆధునిక టర్బైన్ ప్రారంభానికి ముస్తాబైంది. పామాయిల్ పరిశ్రమలో గానుగ ఆడిన వచ్చే ఖాళీ గెలల ద్వారా 2.50 మెగావాట్ల విద్యుత్తును ఉత్పత్తి చేసే పరిశ్రమ అవసరాలు తీర్చేలా దీని ఆకృతి రూపొందించారు. నూతన టర్బైన్‌లో రేడియేటర్ డ్రై ఫైర్, అల్యూమినియం బాయిలర్ అప్‌లెట్ దశ పూర్తయ్యాయి. ఈ టర్బైన్‌ను పూర్తిగా కంప్యూటర్లు, ఆటోమేటిక్ యంత్రాలతో ఏర్పాటు చేశారు.

ఏడాదికి రూ.1.50-1.80 కోట్లు ఆదా

పెడ్డేట్ ఫైబర్‌తో నడిచే ఈ బాయిలర్ సామర్థ్యం 30 టీపీహెచ్ (టన్ను పర్ అవర్)గా నిర్మించారు. దీనివల్ల నెలకు రూ.15లక్షలకు తగ్గకుండా ఏడాదికి రూ.1.50 కోట్ల నుంచి రూ.1.80 కోట్ల వరకు విద్యుత్తు బిల్లు ఆదా కానుంది. పామాయిల్ పరిశ్రమకు అంతరాయం లేకుండా విద్యుత్తు సరఫరా అవనుంది. అప్పారావుపేట పామాయిల్ పరిశ్రమలో వినియోగించిన ఇలాంటి పరిజ్ఞానం సత్తుపల్లిలో ఉపయోగిస్తోంది. వచ్చే ఏడాది 60 టన్నుల సామర్థ్యంతో నూతన పామాయిల్ పరిశ్రమ ప్లాంట్ పనులు ప్రారంభం కానున్నాయి.



అశ్వారావుపేట పామాయిల్ పరిశ్రమలో ఆధునిక టర్బైన్

టర్బైన్ ప్రారంభోత్సవానికి మంత్రుల రాక

నూతన టర్బైన్ ప్రారంభోత్సవానికి ఉప ముఖ్యమంత్రి మల్లు భట్టివిక్రమార్క, వ్యవసాయశాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు, రెవెన్యూశాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి, ఉమ్మడి ఖమ్మం జిల్లా ఇన్‌ఛార్జి మంత్రి కోమటిరెడ్డి వెంకటరెడ్డి, రాజ్యసభ సభ్యులు రేణుకా చౌదరి, బండి పార్థసారథిరెడ్డి, లోక్‌సభ సభ్యులు రామసహాయం రఘురాంరెడ్డి, పి.బలరాంనాయక్, టీజీ ఫెడ్ ఛైర్మన్ జంగా రాఘవరెడ్డి తదితరులు హాజరుకానున్నారని ఆయిల్‌ఫెడ్ జనరల్ మేనేజర్ సుధాకర్‌రెడ్డి తెలిపారు.



అమ్మ పనిబాట.. బుజ్జాయి ఆటాపాట

ఉద్యోగం చేసే మహిళలు చిన్నపిల్లలను చూసుకోవడం ఇబ్బందే. ఇంటివద్ద పెద్దలెవరూ లేని పక్షంలో ఆయాలను ఏర్పాటు చేసుకోవడం, పిల్లలు ఎలా ఉన్నారో అని ఆందోళన చెందడం సాధారణమే. దీనికి పరిష్కారంగా ఖమ్మం కలెక్టరేట్‌లో శిశు సంరక్షణ కేంద్రం(క్రెచ్) ఏర్పాటు చేశారు. దాదాపు అన్ని జిల్లా కార్యాలయాలు ఇక్కడే ఉండటంతో చిన్న పిల్లల తల్లులకు ఇబ్బందులు తీరాయి. ఉదయం విధులకు హాజరయ్యే సమయంలో ఇందులో పిల్లలను వదిలిపెట్టి సాయంత్రం వెళ్లేటప్పుడు తీసుకెళ్తున్నారు. ఇక్కడ ఆట వస్తువులు, చిన్న మంచాలు, జారుడు బల్లలు, గోడలపై తీర్చిదిద్దిన బొమ్మలు పిల్లలను ఆకట్టుకుంటున్నాయి. సిబ్బంది చిన్నారులను లాలించి ఆడిస్తున్నారు. – ఖమ్మం నగరం, న్యూస్‌టుడే – ఈనాడు, ఖమ్మం

ఆ కుటుంబంలో ఆరుగురు ఉపాధ్యాయులు..!

పాల్వంచ, న్యూస్‌టుడే

ఇప్పటికే ఆ ఇంట్లో ముగ్గురు సోదరులు ఉపాధ్యాయులుగా పనిచేస్తున్నారు. వారి వారసులలో మరో ముగ్గురు తాజా డీఎస్సీలో కొలువులు సాధించి శెభాష్ అనిపించుకున్నారు. కుటుంబ సభ్యుల ప్రోత్సాహంతో.. కృషి, పట్టుదలతోపాటు ఆత్మవిశ్వాసంతో విజయాలందుకున్న యువ సోదరులు గ్రామస్థుల అభినందనలు అందుకున్నారు. పాల్వంచ మండలం జగ్గుతండాకు చెందిన నూనావత్ హరిసింగ్, మీరమ్మలకు ఐదుగురు కుమారులు, ఒక కుమార్తె. కుమారుల్లో రాంబాబు, శంకర్, భిక్షులు జిల్లాలో ప్రభుత్వ ఉపాధ్యాయులుగా పనిచేస్తున్నారు. తాజాగా వెల్లడైన డీఎస్సీ-2024 ఫలితాల్లో రాంబాబు కుమారుడు హరీశ్‌కుమార్‌తో పాటు ఆయన మిగతా ఇద్దరు అన్నల కుమారులూ ఉపాధ్యాయ కొలువులు సాధించారు. వీరిలో హరికిషన్ కుమారుడు సురేందర్, బాబు కుమారుడు నరేందర్ ఉన్నారు. ఒకే నోటిఫికేషన్‌లో ఒకే కుటుంబానికి చెందిన ముగ్గురు యువకులు టీచర్ కొలువు సాధించటంతో వారి ఆనందానికి అవధుల్లేవు. విజేతలుగా నిలిచి నియామక పత్రాలు అందుకున్న ఆ ముగ్గురు యువకులను గ్రామస్థులు అభినందించారు. 'ఎన్నో ఏళ్లుగా ఉపాధ్యాయ వృత్తిలో రాణిస్తున్న మా బాబాయిలనే స్ఫూర్తిగా తీసుకున్నాం. ఎలాంటి శిక్షణ లేకుండా, వారి మార్గ నిర్దేశనంలోనే కొలువులు సాధించడం ఆనందంగా ఉంది' అని వారన్నారు. వీరి మేనత్త సరోజ భర్త శ్రీనివాసరావు కూడా ప్రభుత్వ ఉద్యోగే కావడం కొసమెరుపు.



హరీశ్‌కుమార్, సురేందర్, నరేందర్

తండ్రి బాటలో.. ప్రత్యేక విద్య కోటాలో..

హరీశ్‌కుమార్ గత ఆరేళ్లుగా ప్రత్యేక విద్య విభాగంలో తాత్కాలిక పద్ధతిలో బోధన కొనసాగించారు. గత డీఎస్సీ నోటిఫికేషన్ రాగానే తన తండ్రి, ఇద్దరు బాబాయిల సూచనలతో, పక్కా ప్రణాళికతో సిద్ధమయ్యారు. స్పెషల్ ఎడ్యుకేషన్ ఎస్జీటీ విభాగంలో జిల్లాలో 23వ ర్యాంకు సాధించారు. ఇటీవల హైదరాబాద్‌లో ఉన్నతాధికారుల చేతుల మీదుగా నియామక పత్రం అందుకున్నారు.

ఆరేళ్లుగా నిరీక్షించి.. విజేతగా నిలిచి..

ఎలాగైనా ఉపాధ్యాయ కొలువు సాధించాలనేది నరేందర్ కల. ఈ కలను నెరవేర్చుకునేందుకు ఆయన ఆరేళ్లుగా నిరీక్షించారు. ఎప్పుడూ ఆత్మవిశ్వాసాన్ని కోల్పోకుండా పరీక్షకు సిద్ధమయ్యారు. ఎస్జీటీలో దివ్యాంగుల కోటాలో జిల్లాలో ఒకటో ర్యాంకు సాధించారు. తల్లిదండ్రులు బాబు, బాజు ప్రోత్సాహం, బాబాయిల స్ఫూర్తితో విజయం సాధించారు. త్వరలో కొలువులో చేరనున్నందుకు ఎంతో సంతోషంగా ఉందని నరేందర్ చెప్పారు.

ఆన్‌లైన్ శిక్షణ తీసుకుని..

డీఎస్సీ నోటిఫికేషన్ వెలువడటంతోనే సురేందర్ సన్నద్ధత ప్రారంభించారు. తల్లిదండ్రులు హరికిషన్, అనసూర్య ప్రోత్సాహంతో, ఉపాధ్యాయులైన బాబాయిల సలహాతో ఇంటి నుంచే ఆన్‌లైన్ శిక్షణ పొందారు. ఆ తర్వాత ప్రణాళికాబద్ధంగా.. రోజువారీగా ప్రత్యేక సమయం కేటాయించుకొని డీఎస్సీకి పట్టుదలతో సన్నద్ధమయ్యారు. ఎస్జీటీ పోస్టుల్లో జిల్లా స్థాయిలో 29వ ర్యాంక్ సొంతం చేసుకున్నారు. మరో ఇద్దరు సోదరులతో కలిసి తానూ ఉపాధ్యాయ పోస్టు సాధించడంపై సురేందర్ సంతోషం వ్యక్తం చేశారు.



చింతాల పుల్లారావు విజయలక్ష్మి శ్రీహరి

ఇద్దరు పంచాయతీ కార్యదర్శులు..
ఒకరు ఉపాధ్యాయుడు

సుజాతనగర్: ఓ ఇంట్లో ముగ్గురు ప్రభుత్వ ఉద్యోగాలను సాధించి శెభాష్ అనిపించుకున్నారు. సుజాతనగర్ మండలం నాయకులగూడెం గ్రామానికి చెందిన చింతాల పుల్లారావు ఎమ్మెస్సీ బీఈడీ చదివారు. ప్రైవేటు ఉపాధ్యాయుడిగా విధులు నిర్వహిస్తూ, విద్యార్థులకు ట్యూషన్లు చెబుతూ డీఎస్సీ పరీక్షలకు సిద్ధమయ్యారు. ఈ ఏడాది మార్చిలో నోటిఫికేషన్ రావడంతో పట్టుదలతో చదివారు. ఇటీవలి ఫలితాల్లో స్కూల్ అసిస్టెంట్(గణితం)లో జిల్లాలో 10వ ర్యాంకు సాధించి కొలువు దక్కించుకున్నారు. ఆయన భార్య విజయలక్ష్మి, సోదరుడు శ్రీహరి కూడా ఎమ్మెస్సీ బీఈడీ చదివారు. ఇద్దరూ ఉన్నత విద్యావంతులే కావడంతో ప్రభుత్వ ఉద్యోగాలకు సిద్ధమయ్యేలా ప్రోత్సహించారు. ఆయన ప్రోత్సాహంతో 2019లో శ్రీహరి, విజయలక్ష్మి పంచాయతీ కార్యదర్శులుగా ఎంపికయ్యారు. రెండు పర్యాయాలు విఫలమైనా నిరాశ చెందని పుల్లారావు.. తాజా డీఎస్సీ ఫలితాల్లో విజయం సాధించారు.

మహిళ మెడలో గొలుసు చోరీ

కొండపల్లి, న్యూస్‌టుడే: ఓ మహిళ మెడలో బంగారు గొలుసు చోరీకి యత్నించిన వ్యక్తిని స్థానికులు పట్టుకొని దేహశుద్ధి చేసిన ఘటన ఎన్టీఆర్ జిల్లా మైలవరం నియోజకవర్గంలోని కొండపల్లి ఆరు పంపుల కూడలిలో గురువారం చోటుచేసుకుంది. స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం.. మద్దు అన్నపూర్ణ అనే మహిళ ఇంటి ముందు నిల్చొని ఉండగా అటుగా వచ్చిన వ్యక్తి ఆమె మెడలోని గొలుసును లాక్కొని పరుగెత్తాడు. బాధితురాలు కేకలు వేయగా గమనించిన కొందరు యువకులు ఆ దొంగను పట్టుకున్నారు. నిందితుడిది ఖమ్మం జిల్లా ఎర్రుపాలెం మండలం జమలాపురం గ్రామం అని తేలింది. యువకులు దొంగను పోలీస్‌స్టేషన్‌లో అప్పగించారు.



దొంగతనం చేసిన వ్యక్తికి దేహశుద్ధి చేస్తున్న స్థానికులు

వైభవంగా ఐశ్వర్య లక్ష్మి అమ్మకు పూజలు

భద్రాచలం, న్యూస్‌టుడే: దసరా శరన్నవరాత్రి మహోత్సవాలు భద్రాచలంలో రోజురోజుకు వేడుకగా సాగడంతో భక్తులు ఉత్సవాలను వీక్షించి తరిస్తున్నారు. ఏడో రోజైన గురువారం ఐశ్వర్యలక్ష్మిగా అమ్మవారు కనిపించడంతో పరవశించిపోయారు. మమ్ము గన్న మా తల్లి అష్టైశ్వర్యాలను అందించు అంటూ ప్రణమిల్లారు. ఆలయం చుట్టూ ప్రదక్షిణ చేసి భజన కీర్తనలు పాడి మురిసిపోయారు. లక్ష్మీ తాయారు అమ్మవారి ఆలయంలో ప్రత్యేకంగా ఏర్పాటు చేసిన ప్రాంతంలో ఐశ్వర్యలక్ష్మిని వేంచేయింప చేశారు. మహిళలు సామూహికంగా కుంకుమార్చన కొనసాగించారు. 'ఐశ్వర్యం అంటే శాసనపరమైన శక్తి సామర్థ్యాలు అని అర్థం. అఖిలాండ కోటి బ్రహ్మాండాలకు శాసకురాలు అమ్మ. కరుణా రూపిణి అయిన ఈ అమ్మవారి క్రీగంటి చూపుల కదలికలనే శాసనాలుగా భావించి శ్రీ మహావిష్ణువు సకల జగద్రక్షణ చేస్తుంటాడు' అని వైదిక పెద్దలు ప్రవచించారు. ఈ రూపంలో అమ్మను ఆరాధిస్తే శాసకత్వం, వాక్కుకు ప్రభావం, అనంత ఐశ్వర్యం కలుగుతాయని శాస్త్రం. రామాయణ పారాయణం భక్తిప్రపత్తులను పెంచింది. శుక్రవారం వీరలక్ష్మి అలంకారంలో అమ్మవారు దర్శనమిస్తారని తెలిపారు.

☆ భద్రాచలం శ్రీ సీతారామ చంద్రస్వామి ఆలయ మాడవీధులన్నీ గురువారం రామనామాలతో మార్మోగాయి. ఆలయం తలుపులు తెరిచిన తర్వాత అర్చకులు భక్తిశ్రద్ధలతో సుప్రభాతం పలికి ఆరాధించారు. బేడా మండపంలో క్షేత్ర విశిష్టతను వైదిక పెద్దలు ప్రవచనం చేశారు. వైష్ణవ సంప్రదాయం ప్రకారం విష్వక్సేనుణ్ని పూజించి పుణ్యాహవాచనం నిర్వహించారు. మాంగళ్యధారణ నయనానందంగా మారింది. చల్లని రామయ్యకు చక్కని సీతమ్మకు ఘనంగా తలంబ్రాల వేడుక చేశారు. దర్బారు సేవలో స్వామి వైభవం మరింత పెరిగింది. శుక్రవారం బంగారు కవచాల అలంకారంలో రామయ్య దర్శనం ఉంటుందని వైదిక పెద్దలు తెలిపారు.



ఐశ్వర్య లక్ష్మి అలంకారంలో అమ్మవారి దర్శనం



కుంకుమార్చన చేస్తున్న మహిళలు

కాలువే.. నీరు పారుతుందనుకునేరు!

ఈ చిత్రం చూస్తుంటే కాలువలో నీరు పారుతుందనుకుంటే మీరు పొరపడినట్లే. ఇది సీతారామ ప్రాజెక్టు ఆఖరి (16వ) ప్యాకేజీ పరిధిలో కూసుమంచి రెవెన్యూ పరిధిలో తవ్విన పాలేరు లింక్ కెనాల్. కాల్వకు ఒక వైపున సొరంగం తవ్వకం పనులు సాగుతుండగా.. మరో వైపున పనులు పూర్తి కాలేదు. వర్షాలకు వచ్చిన వరద నీరు కాల్వ నిండా చేరి ఇలా కన్పిస్తోంది. కాల్వ, ప్రాజెక్టు పనులు పూర్తయితే గోదావరి నుంచి నీరు పాలేరు జలాశయానికి చేరుతాయని రైతులు అభిప్రాయపడుతున్నారు.

– కూసుమంచి, న్యూస్‌టుడే



యువకుడి అదృశ్యం

ఖమ్మం నేరవిభాగం: హైదరాబాద్ వెళ్లిన యువకుడు కనిపించకుండా పోయిన సంఘటనపై ఖమ్మం ఖానాపురం హవేలి పోలీసు స్టేషన్‌లో గురువారం కేసు నమోదైంది. నగర శివారు కొత్తగూడేనికి చెందిన ములకలపల్లి రాజేశ్(30) సెప్టెంబరు 17న హైదరాబాద్ వెళ్లి వస్తానంటూ ఇంట్లో చెప్పి వెళ్లాడు. ఆపై అతని చరవాణి స్విచ్ఛాఫ్ వస్తోంది. నాటి నుంచి అన్ని ప్రాంతాల్లో వెతికినా ఫలితం లేకపోవడంతో భార్య రేణుక ఫిర్యాదు మేరకు కేసు విచారణ చేపట్టినట్లు ఇన్‌స్పెక్టర్ భానుప్రకాశ్ తెలిపారు.

డిక్కీలో సరకులు సర్దుతున్నంతలోనే..
ముందు సీట్లోని బంగారం సంచి మాయం

చుంచుపల్లి, న్యూస్‌టుడే: కారు ముందు సీట్లో ఉంచిన బంగారు ఆభరణాల సంచిని ఆటోలో వచ్చిన దొంగ చాకచక్యంగా దొంగిలించాడు. బాధితుడు వాహనం డిక్కీలో సరకులు సర్దుతున్నంతలోనే కళ్లుగప్పి చేతివాటాన్ని ప్రదర్శించాడు. ఈ ఘటన చుంచుపల్లి మండలంలో చోటుచేసుకొంది. ఎస్సై రవికుమార్ వివరాల ప్రకారం.. కొత్తగూడెం రైటర్‌బస్తీకి చెందిన సింగరేణి విశ్రాంత ఉద్యోగి వి.వెంకటేశ్వరరావు కొత్తగూడెం పోస్టాఫీస్ ఏరియాలోని బ్యాంకుకు గురువారం వచ్చారు. లాకర్‌లో దాచిపెట్టిన 19 తులాల బంగారాన్ని డ్రా చేసుకున్నారు. అక్కడ్నుంచి విద్యానగర్‌లోని ఓ సూపర్ మార్కెట్ వద్ద ఆగారు. అక్కడ కొన్న సరకులను కారు డిక్కీలో సర్దుకొంటున్నారు. సరిగ్గా అదే సమయంలో ఆటోలో వచ్చిన ఓ వ్యక్తి వెంకటేశ్వరరావు కళ్లుగప్పి.. కారు ముందు డోరును చాకచక్యంగా తెరిచి బంగారు ఆభరణాల కవర్‌ను తస్కరించాడు. క్షణాల్లో అక్కడ్నుంచి మాయమయ్యాడు. డ్రైవర్ సీట్లో కూర్చునేందుకు వచ్చిన బాధితుడు బంగారం మాయమైందని గ్రహించి వెంటనే చుంచుపల్లి పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. సీఐ వెంకటేశ్వర్లు, ఎస్సై రవి కుమార్ ఘటనా స్థలానికి చేరుకుని విచారించారు. పలు వివరాలు సేకరించారు. బ్యాంకు నుంచే వెంకటేశ్వరరావును దొంగ గమనించి చోరీకి పాల్పడి ఉంటాడని పోలీసులు భావిస్తున్నారు.

చికెన్ ధరలు



వెన్‌కాబ్: బ్రాయిలర్ ఫారం లిఫ్టింగ్ ధర -120 రిటైల్ ధర 142 చికెన్ విత్ స్కిన్ - 206, చికెన్ స్కిన్‌లెస్ - 234.

ఖమ్మం వ్యవసాయ మార్కెట్‌లో ధరలు (రూ.లలో)

పంట పేరు	కనిష్ఠ	గరిష్ఠ	నమూనా
కొత్తపత్తి	6,000	6,900	6,700
పాతపత్తి	7,000	7,400	7,300
పెసలు	6,600	7,300	6,775
కందులు	5,200	9,200	9,000
ఏసీ ఎండుమిరప	10,000	19,700	16,400
ఎండుమిరప	9,500	18,600	17,200

దసరా తర్వాతే పత్తి కొనుగోళ్లు

ఈ ఏడాదీ ప్రైవేటు యార్డులోనే..

జూలూరుపాడు, న్యూస్‌టుడే

జూలూరుపాడులో శాశ్వత మార్కెట్ నిర్మాణానికి ప్రభుత్వం ఎట్టకేలకు పదెకరాల స్థలం కేటాయించి మార్కెటింగ్‌శాఖకు అప్పగించింది. మార్కెటింగ్ శాఖ అధికారులు ఇటీవల సరిహద్దులను గుర్తించి రాళ్లు పాతారు. జూలూరుపాడులో ఉప మార్కెట్ యార్డు 20 ఏళ్లుగా ప్రైవేటు స్థలంలోనే కొనసాగుతోంది. ఏన్కూరు మార్కెట్ కమిటీ ఆధ్వర్యంలో దీన్ని నిర్వహిస్తున్నారు. జిల్లాల విభజన అనంతరం ఈ మార్కెట్ యార్డును శాశ్వత మార్కెట్‌గా మార్చాలనే డిమాండ్లు ఊపందుకున్నాయి. ఈనేపథ్యంలో జూలూరుపాడు రెవెన్యూ పరిధిలోని ప్రభుత్వ భూమిని శాశ్వత మార్కెట్ నిర్మాణానికి కేటాయిస్తూ ప్రభుత్వం ఉత్తర్వులిచ్చింది. నిర్మాణ పనులు చేపట్టేందుకు నిధుల కేటాయింపు తదితర అంశాలు పరిశీలనలో ఉన్నాయి. ఈ ఏడాది కూడా ప్రైవేటు స్థలంలోనే పత్తి కొనుగోళ్లు జరపాలని అధికారులు నిర్ణయించారు.



జూలూరుపాడులో పత్తి క్రయవిక్రయాలు (పాత చిత్రం)

ఆదాయం ఘనం.. అవస్థలూ అధికం

జూలూరుపాడు ఉప మార్కెట్ యార్డులో ఏటా రూ.20కోట్లకు పైగా వ్యాపారం జరుగుతుంది. మార్కెట్ కమిటీకి రూ.2కోట్ల వరకు ఆదాయం సమకూరుతుంది. ఇంత ఆదాయం ఉన్నా ప్రైవేటు స్థలంలో అసౌకర్యాల నడుమ రైతులు, వ్యాపారులు ఇబ్బందులు పడుతున్నారు. కేటాయించిన స్థలంలో ఇప్పట్లో శాశ్వత నిర్మాణ పనులు చేపట్టే అవకాశం లేదు. ప్రైవేటు స్థలంలో సరైన భద్రత సౌకర్యాలు లేవు. అగ్ని ప్రమాదాలు సంభవించినా, అధిక వర్షాలు కురిసినా మార్కెట్‌కు వచ్చిన సరకును రక్షించుకోలేని పరిస్థితి. అంతేకాకుండా రైతులకు విశ్రాంతి తీసుకునే అవకాశం లేదు. మండుటెండల్లోనే మగ్గాల్సి ఉంటుంది. హమాలీలు భోజనాలు చేసేందుకు అవస్థలు పడుతున్నారు. వీటన్నింటినీ అధిగమించేందుకు శాశ్వత మార్కెట్ పనులు త్వరితగతిన ప్రారంభించాలని రైతులు కోరుతున్నారు.

అడపాదడపా వర్షాలు కురుస్తుండటంతో..

దసరా పండగ తరువాత జూలూరుపాడు మార్కెట్ యార్డులో పత్తి కొనుగోళ్లు ప్రారంభించాలని అధికారులు యోచిస్తున్నారు. ప్రస్తుతం అడపాదడపా వర్షాలు కురుస్తుండటంతో పత్తి తీసేందుకు అవకాశం లేకుండా పోతోంది. దీపావళి నాటికి మార్కెట్‌కు పత్తి విరివిగా వచ్చే అవకాశాలు కనిపిస్తున్నాయని వ్యాపార వర్గాలు భావిస్తున్నాయి. జూలూరుపాడులోని ఉప మార్కెట్ యార్డుకు ఖమ్మం, భద్రాద్రి జిల్లాల నుంచే కాకుండా ఆంధ్రప్రదేశ్‌లోని వివిధ జిల్లాల నుంచి పత్తిని తీసుకొచ్చి విక్రయిస్తుంటారు. వచ్చే మార్చి వరకు ఇక్కడ పత్తి క్రయవిక్రయాలు జరుగుతాయి. ఇక్కడి నుంచే ఆదిలాబాద్, గుంటూరు, మహారాష్ట్ర, గుజరాత్ రాష్ట్రాల్లోని మార్కెట్లకు సైతం వ్యాపారులు పత్తిని ఎగుమతి చేస్తుంటారు.

ఏన్కూరు మార్కెట్ కమిటీ పరిధిలోనే ఈ ఏడాది కూడా పత్తి కొనుగోళ్లు చేపడతాం. శాశ్వత మార్కెట్ నిర్మాణానికి ప్రభుత్వం స్థలం అప్పగించింది. ఇటీవల ఆ స్థలానికి హద్దులు గుర్తించాం. ఇక్కడ పనులు చేపట్టేందుకు కొంత సమయం పట్టవచ్చు. అప్పటివరకు ప్రైవేటు స్థలంలోనే దసరా పండగ తరువాత పత్తి కొనుగోళ్లు ప్రారంభిస్తాం.

- బజారు, మార్కెట్ కమిటీ కార్యదర్శి, ఏన్కూరు

సత్తుపల్లి

•సత్తుపల్లి •మధిర •వైరా

మధిరలో 19న సబ్‌కోర్టు ప్రారంభం



సమావేశ మందిరాన్ని పరిశీలిస్తున్న న్యాయమూర్తి కార్తీక్‌రెడ్డి, ఏసీపీ రెహ్మాన్

మధిర పట్టణం, న్యూస్‌టుడే: మధిరలో ఈ నెల 19న చేపట్టనున్న కోర్టు నూతన భవన నిర్మాణాల శంకుస్థాపన తోపాటు, సబ్‌కోర్టు ప్రారంభోత్సవ కార్యక్రమానికి పనులు వేగంగా సాగుతున్నాయి. గురువారం పనులను మధిర కోర్టు న్యాయమూర్తి టి.కార్తీక్‌రెడ్డి, వైరా ఏసీపీ రెహ్మాన్‌తో పాటు పోలీస్ అధికారులు పరిశీలించారు. జిల్లా అడ్మినిస్ట్రేటివ్ న్యాయమూర్తి శ్రీసుధ అభివృద్ధి కార్యక్రమాలకు హాజరవుతారని మధిర బార్ అసోసియేషన్ తెలిపింది. తర్వాత వీఎస్ సెంట్రల్ ఫంక్షన్ హాల్‌లో ఏర్పాటు చేసే సమావేశంలో పాల్గొంటారని తెలిపారు.

మేమున్నాం.. మీకు తోడుగా.. (10 AM TO 1 PM)
సత్తుపల్లి : 93922 39905
మధిర : 98668 05652
వైరా : 76619 46938

సమస్య: తిరుమలాపురం అడ్డరోడ్డు వద్ద ఉన్న బస్ షెల్టర్‌లో ప్రయాణికులు కూర్చునే వీల్లేకుండా కొందరు ద్విచక్ర వాహనాలు, సైకిళ్లు ఉంచుతున్నారు. **శ్రీనివాస్**

సమాధానం: బస్ షెల్టర్‌లో వాహనాలు పెట్టకుండా చర్యలు తీసుకుంటాం. ప్రయాణికులకు ఇబ్బంది లేకుండా చూస్తాం. **నాగుల్‌మీరా, ఎస్సై**

– చింతకాని, న్యూస్‌టుడే

ఉపాధ్యాయ కొలువుకు ఎంపిక

వైరా: సిరిపురం గ్రామానికి చెందిన అయిదుగురు అభ్యర్థులు ఉపాధ్యాయ పోస్టులకు ఎంపికయ్యారు. ఇనుపనూరి ఉపేంద్ర, కొత్తపల్లి శివప్రసాద్, పూర్ణకంటి రాణి, కంభంపాటి నవ్య ఎస్జీటీలుగా, అయినాల భరత్ తెలుగు పండిట్ ఉద్యోగానికి నియమితులయ్యారు.

భూ సమస్యలపై ప్రజాయాత్ర

కొణిజర్ల, న్యూస్‌టుడే: పెద్దగోపతి, చిన్నగోపతిలలో సాధిక్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో భూ సమస్యలపై ప్రజాయాత్రను గురువారం నిర్వహించారు. సంస్థ ఛైర్మన్, హైకోర్టు న్యాయవాది సాధిక్ అలీ మాట్లాడుతూ... ధరణి స్థానంలో ప్రభుత్వం తీసుకొస్తున్న భూమాత చట్టం ప్రజలకు న్యాయం చేస్తుందని, ముసాయిదా చట్టంపై ప్రజాభిప్రాయాన్ని కూడా ప్రభుత్వం పరిగణనలోకి తీసుకుని మరిన్ని మార్పులు తీసుకురావాలని ఈ సందర్భంగా ఆయన కోరారు.

పవర్ ట్రాన్స్‌ఫార్మర్ ఏర్పాటు

కొణిజర్ల: అధిక విద్యుత్తు లోడు సమస్యను అధిగమించేందుకు తనికెళ్ల విద్యుత్తు ఉపకేంద్రంలో రూ.1.2 కోట్లతో పవర్ ట్రాన్స్‌ఫార్మర్‌ను గురువారం ఏర్పాటుచేశారు. 5 ఎంవీఏ పవర్ ట్రాన్స్‌ఫార్మర్, దానికి సంబంధించిన కొత్త బ్రేకర్‌ను డీఈ రామారావు ఆధ్వర్యంలో సిబ్బంది ఏర్పాటు చేశారు. ఎంఆర్‌టీ భద్రుపవార్, ఏడీఈ తిలక్, రామదాసు, ఏఈ సురేశ్ పాల్గొన్నారు.

నేడు విద్యుత్తు సరఫరాలో అంతరాయం

సత్తుపల్లి, న్యూస్‌టుడే: గౌరిగూడెం ఫీడర్ మరమ్మతుల కారణంగా శుక్రవారం విద్యుత్తు సరఫరాకు అంతరాయం వాటిల్లుతుందని ఏఈ శరత్ ఓ ప్రకటనలో తెలిపారు. ఉదయం 8.30 నుంచి 11.30 గంటల వరకు సదాశివుని పాలెం సబ్‌స్టేషన్, నారాయణపురం ఫీడర్, తుంబూరు, సిద్ధారం, కొత్తూరు, రేజర్ల, సర్వారాయ ఫీడర్లలో విద్యుత్తు సరఫరా నిలిచిపోనుందన్నారు.

'రతన్‌టాటా మృతి దేశానికి తీరని లోటు'

సత్తుపల్లి, న్యూస్‌టుడే: ప్రముఖ వ్యాపారవేత్త, టాటా గ్రూప్ గౌరవ ఛైర్మన్ రతన్‌టాటా మృతి దేశానికి తీరని లోటని మాజీ ఎమ్మెల్యే సండ్ర వెంకటవీరయ్య ఓ ప్రకటనలో తెలిపారు. కొవిడ్ సమయంలో టాటా సంస్థ తన విశాల హృదయాన్ని చాటుకుని రూ.1500 కోట్లు విరాళం ఇచ్చిందని గుర్తుచేశారు.

పంచాయతీ కార్యదర్శుల మండల కమిటీ

కల్లూరు, న్యూస్‌టుడే: మండల పరిధిలోని 31 పంచాయతీల కార్యదర్శులు గురువారం సాయంత్రం ఎంపీడీఓ కార్యాలయంలో సమావేశమై నూతన కమిటీని ఎన్నుకున్నారు. అధ్యక్ష, కార్యదర్శులుగా జి.మహేష్, భూక్యా సైదులు నియమితులయ్యారు. గౌరవ అధ్యక్షునిగా కె.రాంప్రసాద్, ప్రధాన కార్యదర్శిగా వై.శ్రీనును ఈ సందర్భంగా ఎన్నుకున్నారు.

'ప్రజా సంఘాలను బలోపేతం చేయాలి'

పెనుబల్లి, న్యూస్‌టుడే: ప్రజా సంఘాలను బలోపేతం చేయాలని సీపీఎం రాష్ట్ర కమిటీ సభ్యురాలు మాచర్ల భారతి అన్నారు. వీఎం బంజర్‌లోని చలమాల సూర్యనారాయణ భవన్‌లో సీపీఎం మండల కమిటీ సమావేశం గురువారం నిర్వహించారు. పార్టీ జిల్లా కమిటీ సభ్యులు మాదినేని రమేశ్, చలమాల విఠల్‌రావు, మండల కార్యదర్శి గాయం తిరుపతిరావు పాల్గొన్నారు.

నిష్పక్షపాతంగా లబ్ధిదారులను ఎంపిక చేయాలి

బోనకల్లు, న్యూస్‌టుడే: ఇందిరమ్మ ఇళ్ల లబ్ధిదారుల ఎంపిక నిష్పక్షపాతంగా నిర్వహించాలని కోరుతూ ఎంపీడీవో, తహసీల్దార్‌లకు సీపీఐ ఆధ్వర్యంలో గురువారం వినతి పత్రాలు అందజేశారు. సీపీఐ మండల కార్యదర్శి ఎంగల ఆనందరావు ఆధ్వర్యంలో ఎంపీడీవో రవికుమార్, తహసీల్దార్ పున్నం చందర్‌కి వినతి పత్రాలు ఇచ్చారు. సీపీఐ నాయకులు తూము రోషన్‌కుమార్, పవన్, రామారావు, ఏలూరి పూర్ణచంద్ తదితరులు పాల్గొన్నారు.

ఊరూవాడ.. పూలవనం..



సత్తుపల్లి: బేతుపల్లి వడ్లపూడి వారి వీధిలో...



ముదిగొండ: అయ్యగారి పల్లిలో..



కారేపల్లి: బతుకమ్మ వేడుకలో మహిళలు, యువతులు



సత్తుపల్లి: వనదుర్గ అవతారంలో



మధిర: లడక్‌వీధిలో..



ముదిగొండ మండలం వల్లభి గ్రామంలో మహిళల కోలాహలం..



చింతకాని మండలం లచ్చగూడెంలో భారీ బతుకమ్మతో మహిళలు..

సద్దుల బతుకమ్మ వేడుకలు అంబరాన్నంటాయి. ఊరూవాడ ఒకేచోట కలిసిందా అన్నరీతిలో సందడి నెలకొంది. చివరి రోజు గురువారం భారీ బతుకమ్మలతో మహిళలు, చిన్నారులు ఉత్సాహంగా ఆడిపాడారు. వెళ్లిరావమ్మా.. మళ్లీరా అంటూ బతుకమ్మలను సమీప జలాశయాల్లో నిమజ్జనం చేశారు.

– న్యూస్‌టుడే యంత్రాంగం



మధిర మండల దెందుకూరు గ్రామంలో...



కల్లూరు: పుల్లయ్య బంజర్ రహదారిలో...



తల్లాడ మండలం కొత్తవెంకటగిరిలో..



ఎర్రుపాలెం: పెగళ్లపాడులో కుంకుమార్చన పూజలో మహిళలు



వేంసూరు మండలం సత్యనారాయణపురంలో



తల్లాడ: రంగంబంజరలో అన్నదానాన్ని ప్రారంభిస్తున్న మట్టా దయానంద్



ఎర్రుపాలెంలో 13 అడుగుల బతుకమ్మతో..

దుర్గాదేవిగా అమ్మవారు



ఎర్రుపాలెం, న్యూస్‌టుడే: జమలాపురం శ్రీవేంకటేశ్వరస్వామి ఆలయంలో శ్రీదేవీ శరన్నవరాత్రి వేడుకల్లో భాగంగా ఎనిమిదో రోజు గురువారం దుర్గాష్టమి పర్వదినాన దుర్గాదేవి అవతారంలో అమ్మవారు దర్శనమిచ్చారు. ఈఓ కె.జగన్మోహన్‌రావు, ధర్మకర్త ఉప్పల శ్రీరామచంద్రమూర్తి, పర్యవేక్షకురాలు కె.విజయకుమారి, ప్రధాన అర్చకుడు ఉప్పల శ్రీనివాస్‌శర్మ, మురళీమోహనశర్మ, అర్చకులు, సిబ్బంది పాల్గొన్నారు.

రేపటి నుంచి శ్రీకోటమైసమ్మ జాతర

కారేపల్లి, న్యూస్‌టుడే: ఉసిరికాయలపల్లిలో పెద్దఎత్తున జరగనున్న శ్రీకోటమైసమ్మ జాతర ఈ నెల 12 నుంచి మొదలుకానుంది. భక్తులు భారీగా హాజరు కానున్న ఈ వేడుక కోసం ఇప్పటికే దేవాదాయ శాఖ అన్ని రకాల ఏర్పాట్లు పూర్తి చేసింది. ఐదు రోజులపాటు అంగరంగ వైభవంగా సాగనున్న ఈ వేడుకకు పోలీసు యంత్రాంగం సైతం భారీ బందోబస్తు ఏర్పాటు చేయనున్నారు. కాగా ఇప్పటికే ప్రత్యేక పూజా కార్యక్రమాలు కొద్ది రోజుల నుంచి జరుగుతున్నాయి.

కటికి బాబురావుకు నివాళి

తల్లాడ, న్యూస్‌టుడే: మల్లవరం గ్రామానికి చెందిన కటికి బాబురావు(ప్రైవేట్ సర్వేయర్) దశదినకర్మ గురువారం నిర్వహించారు. కాంగ్రెస్ మండల అధ్యక్షుడు కాపా సుధాకర్, దగ్గుల రఘుపతిరెడ్డి, మాజీ ఎంపీపీ దొడ్డా శ్రీనివాసరావు, సొసైటీ ఛైర్మన్ రెడ్డెం వీరమోహన్‌రెడ్డి తదితరులు బాబురావు చిత్రపటానికి నివాళి అర్పించారు.

ఏమి హాయిలే ఇలా...

కల్లూరు పట్టణ పరిధిలోని ఓ ఏటీఎంలో గురువారం కొద్దిసేపు ఆవు సేదదీరింది. సాధారణంగా వేసవి రోజుల్లో ఉష్ణతాపాన్ని తట్టుకోలేక వీధి శునకాలు ఏటీఎంలలో తిష్టవేస్తుంటాయి. అందుకు భిన్నంగా ఓ ఆవు డబ్బులు తీసే యంత్రానికి అడ్డంగా, హాయిగా ఇలా సేద దీరుతుండటంతో స్థానికులు ఆసక్తిగా తిలకించారు.



కల్లూరు, న్యూస్‌టుడే

షాపింగ్ కాంప్లెక్స్ నిర్మాణంపై సమీక్ష

వైరా, న్యూస్‌టుడే: వైరా మున్సిపాలిటీ పరిధిలోని మధిరరోడ్డు, క్రాస్‌రోడ్‌లో షాపింగ్ కాంప్లెక్స్ నిర్మించే విషయమై ఎమ్మెల్యే రాందాస్‌నాయక్ గురువారం రాత్రి సమీక్ష నిర్వహించారు. నీటిపారుదల శాఖ, ఆర్‌అండ్‌బీ స్థలాల్లో ఆక్రమిత దుకాణాలను గతంలోనే తొలగించగా ఇంకా కొన్ని దుకాణాలు స్టేపై కొనసాగుతున్నాయి. గతంలో తొలగించిన దుకాణాల స్థానాలు ఖాళీగా ఉండటంతో స్థలాలు కోల్పోయిన చిరువ్యాపారులు తీవ్ర ఇబ్బందులు పాలవుతున్నారు. ఈ నేపథ్యంలో దుకాణదారులతో సమీక్ష నిర్వహించి నూతన నిర్మాణాలు చేపట్టేందుకు అందరూ సహకరించాలని ఎమ్మెల్యే కోరారు. ఇప్పటికే స్టే పొందిన కొందమంది దీనికి సానుకూలత వ్యక్తం చేయగా మరి కొంతమంది సమీక్ష సమావేశానికి రాలేదు. మార్క్‌ఫెడ్ మాజీ ఉపాధ్యక్షుడు బొర్రా రాజశేఖర్, కాంగ్రెస్ జిల్లా అధ్యక్షుడు పువ్వాళ్ల దుర్గాప్రసాద్, మున్సిపల్ ఛైర్మన్ సూతకాని జైపాల్, టీపీసీసీ కార్యదర్శి కట్ల రంగారావు, కాంగ్రెస్ మండల పట్టణ అధ్యక్షుడు శీలం వెంకటనర్సిరెడ్డి, ఏదునూరు సీతారాములు తదితరుల పాల్గొన్నారు.



సమీక్ష నిర్వహిస్తున్న ఎమ్మెల్యే రాందాస్‌నాయక్

తాగునీటి పనుల పరిశీలన

కారేపల్లి, న్యూస్‌టుడే: స్థానిక భరత్‌నగర్ కాలనీలో జరుగుతున్న తాగునీటి పైపులైను ఏర్పాటు పనులను డీఎల్‌పీవో రాంబాబు గురువారం పరిశీలించారు. మండలంలో నీటి సరఫరా విషయంలో ప్రజలకు ఎలాంటి ఇబ్బందులు లేకుండా చూడాలని స్థానిక అధికారులకు సూచించారు. కాంగ్రెస్ ఎస్సీ సెల్ మండలాధ్యక్షుడు మేదరి టోని గ్రామంలో నెలకొన్న సమస్యలను ఈ సందర్భంగా డీఎల్‌పీవోకు వివరించారు.

వైద్య విద్యార్థినికి చేయూత


వైరా, న్యూస్‌టుడే: చిన్నతనం నుంచి అమ్మమ్మ, తాతయ్య వద్ద ఉంటూ మెడిసిన్ సీటు సాధించి కనీస నిర్వహణ ఖర్చులు లేక ఇబ్బంది పడుతున్న దుద్దెపుడికి చెందిన వైద్య విద్యార్థిని హర్షితకు దాతలు చేయూత అందించారు. కాంగ్రెస్ నాయకుడు దార్నా రాజశేఖర్ ఆధ్వర్యంలో బొర్రా యూత్ వాట్సప్ గ్రూపు సభ్యుల నుంచి సేకరించిన రూ.22,500, అయిలూరి లక్ష్మీ జ్ఞాపకార్థం కుమార్తె కిరణ్మయి అందించిన రూ.10 వేలు కలిపి మొత్తం రూ.32,500లను గురువారం మార్క్‌ఫెడ్ మాజీ ఉపాధ్యక్షుడు బొర్రా రాజశేఖర్, పురపాలక ఛైర్మన్ సూతకాని జైపాల్ చేతుల మీదుగా అందించారు. టీపీసీసీ కార్యదర్శి కట్ల రంగారావు, మండల కాంగ్రెస్ అధ్యక్షుడు శీలం వెంకటనర్సిరెడ్డి, అయిలూరి జగన్మోహన్, మిట్టపల్లి నాగి, పొదిల హరినాథ్, జాలాది రామకృష్ణ, నాళ్ల రమేశ్ పాల్గొన్నారు. ✦ పేబ్యాక్ టూ సొసైటీ వ్యవస్థాపకుడు జంగం లక్ష్మణ్ ఆధ్వర్యంలో వైద్య విద్యార్థినికి రూ.10 వేలను గురువారం అందించారు. కనకయ్య, సాయిబాబు, మోహన్‌రావు, యెహోను పాల్గొన్నారు.



విద్యార్థినికి నగదు అందిస్తున్న బొర్రా రాజశేఖర్, సూతకాని జైపాల్

వేతనాలు అందించాలని నిరసన

వైరా, న్యూస్‌టుడే: మూడు నెలలుగా వేతనాలు అందించడం లేదంటూ జలాశయం గుట్టల వద్ద మిషన్ భగీరథ పథకంలో పని చేస్తున్న కార్మికులు గురువారం నిరసన తెలిపారు. కార్మికులు విధులకు గైర్హాజరవడంతో 12 మండలాలకు తాగునీటి సరఫరా నిలిచిపోయింది. కార్మిక సంఘం ఐకాస నాయకుడు మద్దెల రవి మాట్లాడుతూ దసరా వస్తున్నా మూడు నెలల వేతనాలు అందించలేదని, కనీసం కుటుంబం గడవక ఇబ్బంది పడుతున్నా అధికారులు స్పందించడంలేదన్నారు. బాధ్యులు రేపాకుల శ్రీనివాస్, వేణుబాబు, నారాయణ, రాంబాబు, కృష్ణ, రామారావు, వెంకయ్య తదితరులు పాల్గొన్నారు.



చికిత్స పొందుతూ మృతి

కల్లూరు, న్యూస్‌టుడే: బత్తులపల్లిలో రాజనేని గోపి (36) అనే ప్రైవేటు ఎలక్ట్రీషియన్ వివాహం కావటం లేదనే మనస్తాపంతో బుధవారం రాత్రి పురుగుల మందుతాగాడు. ఖమ్మం ప్రభుత్వ వైద్యశాలలో చికిత్స పొందుతూ గురువారం మృతి చెందాడు. సోదరి రాధ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ షాకీర్ తెలిపారు.

కళాశాలలో కంప్యూటర్ చోరీ

వైరా: స్థానిక ప్రభుత్వ జూనియర్ కళాశాల కార్యాలయ గదిలో కంప్యూటర్, సీపీయూ చోరీకి గురైంది. సిబ్బంది పోలీసులకు ఫిర్యాదు చేశారు.

25 క్వింటాళ్ల రేషన్ బియ్యం పట్టివేత

చింతకాని, న్యూస్‌టుడే: 25 క్వింటాళ్ల రేషన్ బియ్యాన్ని గురువారం కేసు నమోదు చేసినట్లు ఎస్సై నాగుల్‌మీరా తెలిపారు. ఖమ్మం నుంచి ఏపీలోని వత్సవాయి మండలం లింగాలకు అక్రమంగా రేషన్ బియ్యం తరలుతున్నట్లు పోలీసులకు సమాచారం అందింది. జగన్నాథపురం వద్ద ఆటోను పట్టుకుని డ్రైవర్ వేముల నాగబాబుపై కేసు నమోదు చేసినట్లు ఎస్సై తెలిపారు.

జూద స్థావరంపై దాడి

మధిర గ్రామీణం, న్యూస్‌టుడే: మాటూరు గ్రామం సమీపంలో జూద స్థావరంపై బుధవారం రాత్రి దాడి చేసి ఆరుగురిని అదుపులోకి తీసుకున్నట్లు గ్రామీణ ఎస్సై లక్ష్మీభార్గవి గురువారం తెలిపారు. రూ.4,330 నగదు, రెండు బైక్‌లు, అయిదు చరవాణులు స్వాధీనం చేసుకున్నామన్నారు.

బోనకల్లు మండలానికి మహర్దశ

రూ.305 కోట్లతో యంగ్ ఇండియా ఇంటిగ్రేటెడ్ పాఠశాలకు నేడు శంకుస్థాపన



లక్ష్మీపురంలో పాఠశాల నిర్మించనున్న స్థలం

బోనకల్లు, న్యూస్‌టుడే: బోనకల్లు మండలానికి మహర్దశ పట్టనుంది. రూ.305 కోట్లతో నిర్మించనున్న యంగ్ ఇండియా సమీకృత పాఠశాలకు లక్ష్మీపురంలో ఉప ముఖ్యమంత్రి మల్లు భట్టి విక్రమార్క శుక్రవారం శంకుస్థాపన చేయనున్నారు. ఈ పాఠశాల అందుబాటులోకి వస్తే బోనకల్లు మండలం విద్యాకేంద్రంగా భాసిల్లనుంది. గతంలో కాంగ్రెస్ ప్రభుత్వ హయాంలో డిప్యూటీ స్పీకర్‌గా ఉన్నప్పుడు భట్టి విక్రమార్క.. మధిర నియోజకవర్గంలోని ఐదు మండలాలకు గాను నాలుగు మండలాల్లో కేజీబీవీలను ఏర్పాటు చేయించారు. బోనకల్లులో జ్యోతి బాపులే బీసీ బాలుర గురుకుల పాఠశాల, ఎస్సీ బాలికల గురుకుల పాఠశాల ఏర్పాటుకు చొరవ చూపారు. తాజాగా 3వేల మంది విద్యార్థులు ఒకేచోట చదువుకునేందుకు వీలుగా అంతర్జాతీయ స్థాయి ప్రమాణాలతో యంగ్ ఇండియా సమీకృత పాఠశాలను లక్ష్మీపురంలో ఏర్పాటు చేస్తుండటం గమనార్హం.

మెరుగుపడుతున్న మౌలిక వసతులు

యంగ్ ఇండియా సమీకృత పాఠశాల ఏర్పాటుతో కొన్ని గ్రామాల్లో మౌలిక వసతులు మెరుగుపడనున్నాయి. గోవిందాపురం(ఎల్), లక్ష్మీపురం గ్రామాల నుంచి పాఠశాల వరకు 60 అడుగుల వెడల్పుతో రోడ్డు నిర్మిస్తున్నారు. 25 ఎకరాల్లో 60 గదులు, వివిధ క్రీడా ప్రాంగణాలతో పాఠశాల నిర్మాణం కానుంది. శనివారం ఉదయం 11 గంటలకు ఉప ముఖ్యమంత్రి మల్లు భట్టి విక్రమార్క శంకుస్థాపన చేయనున్నారు. ఈ కార్యక్రమానికి మండలంలోని ప్రభుత్వ ఉపాధ్యాయులందరూ హాజరుకావాలని విద్యాశాఖ ఆదేశించింది. ప్రభుత్వ ఉన్నత పాఠశాలల విద్యార్థులను బస్సుల ద్వారా కార్యక్రమానికి తరలించనున్నారు.

ఐఎన్‌టీయూసీలో చేరిక

ఎర్రుపాలెం, న్యూస్‌టుడే: మండలంలోని మిషన్ భగీరథలో విధులు నిర్వహిస్తున్న వివిధ సంఘాల కార్మికులు కాంగ్రెస్ మండల అధ్యక్షుడు వేమిరెడ్డి సుధాకర్‌రెడ్డి ఆధ్వర్యంలో ఐఎన్‌టీయూసీలో గురువారం చేరారు. చేరిన వారిలో డి.వెంకటకృష్ణ, బి.అబ్రహం, ఎం.వెంకటేశ్వర్లు, జి.వెంకటేశ్వర్లు తదితరులు ఉన్నారు. మిషన్ భగీరథ కార్మిక సంఘం జిల్లా అధ్యక్షుడు వి.అనంతరాములు, మండల బాధ్యుడు ఆనందరావు పాల్గొన్నారు.

బాధిత కుటుంబానికి ఆర్థిక సాయం

ఎర్రుపాలెం, న్యూస్‌టుడే: పెద్దగోపవరం గ్రామానికి చెందిన ఉపాధి హామీ పథకం సాంకేతిక సహాయకుడు మందా నాగేశ్వరరావు ఇటీవల గుండెపోటుతో మృతి చెందారు. గురువారం గ్రామంలో నిర్వహించిన సంతాప సభలో డీఆర్‌డీఓ సన్యాసయ్య, ఏపీడీ సీహెచ్ శ్రీనివాసరావు, మధిర ఎంపీడీఓ బి.వెంకటేశ్వర్లు బాధిత కుటుంబాన్ని పరామర్శించి ఉపాధి ఉద్యోగుల తరపున రూ.72వేలు అందించారు. జిల్లా సాంకేతిక సహాయకుల సంఘం అధ్యక్ష, కార్యదర్శులు పి.మనోహర్‌రావు, ఎ.సంతోష్‌కుమార్, జి.భాస్కర్, ఆర్.అనిల్‌కుమార్, ఏపీఓ నాగరాజు, ఈసీ వెంకటేష్ పాల్గొన్నారు.



నగదు అందిస్తున్న డీఆర్‌డీఓ సన్యాసయ్య, సంఘం బాధ్యులు

పామాయిల్ రైతుల సదస్సును విజయవంతం చేయండి

రఘునాథపాలెం, న్యూస్‌టుడే: అశ్వారావుపేటలో 12న ఏర్పాటు చేసిన పామాయిల్ రైతుల అవగాహన సదస్సును విజయవంతం చేయాలని రఘునాథపాలెం సొసైటీ అధ్యక్షుడు తాతా రఘురాం, నాయకులు రైతులకు పిలుపునిచ్చారు. రఘునాథపాలెం రైతు వేదికలో గురువారం విలేకరుల సమావేశంలో మాట్లాడారు. రైతులకు అవగాహన కల్పించేందుకు అశ్వారావుపేటలో 12న సదస్సు ఏర్పాటు చేసినట్లు వివరించారు. పామాయిల్ వ్యర్థాలతో 2.5 మెగావాట్ల సామర్థ్యం కలిగిన విద్యుత్తు పరిశ్రమను మంత్రి తుమ్మల ప్రారంభిస్తారని చెప్పారు. దిరిశాల చిన్న వెంకటేశ్వర్లు, కొంటెముక్కల నాగేశ్వరరావు, వాంకుడోతు దీప్లా నాయక్, చెరుకూరి పూర్ణచంద్రరావు, బోయిన వెంకటనర్సయ్య, మంగీలాల్, రాము, జోయినబోయిన పాపయ్య, బానోతు సుధాకర్, కొంగర నరేశ్, ఆరిఫ్ పాల్గొన్నారు.

ఖమ్మం

• ఖమ్మం • పాలేరు

అన్నదానం

ఖమ్మం కమాన్‌బజార్, న్యూస్‌టుడే: ప్రభుత్వ వైద్య కళాశాల ప్రిన్సిపల్ రాజేశ్వరరావు సతీమణి స్వర్గీయ జ్ఞాపకార్థం గురువారం సర్వజనాసుపత్రిలో అన్నదానం నిర్వహించారు. ఆస్పత్రిలో రోగులు, సహాయకులకు భోజనం వడ్డించి దాతృత్వాన్ని చాటుకున్నారు. కార్యక్రమంలో పిల్లల వైద్య విభాగం హెచ్‌ఓడీ బాబూ రత్నాకర్, ఎలిట్ నందగిరి శ్రీను, సిబ్బంది వినయ్ తదితరులు పాల్గొన్నారు.

ఏసీపీని కలిసిన టీజేఎఫ్ నాయకులు

ఖమ్మం కార్పొరేషన్, న్యూస్‌టుడే: పాత్రికేయుల ఇళ్ల స్థలాల విషయమై టీయూడబ్ల్యూజే(ఐజేయూ) నేతలు ఒకరిపై ఫిర్యాదు చేసిన నేపథ్యంలో గురువారం టీయూడబ్ల్యూజే(టీజేఎఫ్) నేతలు ఏసీపీ రమణమూర్తిని కలిసి వివరాలు అందజేశారు. కార్యక్రమంలో నాయకులు ఆవినారాయణ, సాంబశివరావు, రవి తదితరులు ఉన్నారు.

నాణ్యతతో రహదారుల నిర్మాణం

రఘునాథపాలెం, ఖమ్మం కమాన్‌బజార్, న్యూస్‌టుడే: గ్రామాల్లో సీసీ రహదారులు, మురుగు కాల్వల నిర్మాణ పనులు త్వరగా పూర్తి చేయాలని మంత్రి తుమ్మల నాగేశ్వరరావు అధికారులను ఆదేశించారు. అదనపు కలెక్టర్ డి.మధుసూదన్ నాయక్‌తో కలిసి రఘునాథపాలెం మండలంలోని చింతగుర్తి, గణేశ్వరం, వేపకుంట్ల, చెన్నిపాడుతండాల్లో గురువారం పర్యటించారు. చింతగుర్తిలో 13 సీసీ రహదారులు, మురుగు కాల్వలు, గణేశ్వరంలో రూ.45.50 లక్షలతో 24 సీసీ రహదారులు, మురుగు కాల్వలు, వేపకుంట్లలో రూ.20 లక్షలతో మూడు సీసీ రహదారులు, చెన్నిపాడుతండాలో సీసీ రహదారుల పనులకు శంకుస్థాపన చేశారు.

✦ వి.వెంకటాయపాలెంలో తుమ్మల పర్యటించారు. ఉపాధి హామీ పథకం నిధులు రూ.51.50లతో చేపట్టనున్న 14 అంతర్గత సీసీ రోడ్ల నిర్మాణ పనులకు శంకుస్థాపన చేశారు. దేవీ నవరాత్రి ఉత్సవాల్లో భాగంగా స్థానిక రామాలయంలో ఏర్పాటు చేసిన అమ్మవారికి మంత్రి తుమ్మల ప్రత్యేక పూజలు చేశారు. మండపం వద్ద కుటుంబాల పక్షయ్య కుటుంబ సభ్యుల ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన అన్నదాన కార్యక్రమాన్ని మంత్రి ప్రారంభించారు.



గణేశ్వరంలో శంకుస్థాపన కార్యక్రమంలో తుమ్మల

న్యూస్‌టుడే: ప్రకాశ్‌నగర్ వంతెన పునరుద్ధరణ పనులు దసరా నాటికి పూర్తి చేసి రాకపోకలు ప్రారంభించాలని మంత్రి తుమ్మల అధికారులను ఆదేశించారు. ఖమ్మం కార్పొరేషన్ 28వ డివిజన్‌లో టీయూఎఫ్‌ఐడీసీ నిధులు రూ.1.90 లక్షలతో చేపట్టనున్న స్ట్రామ్ వాటర్ డ్రెయిన్ నిర్మాణ పనులకు గురువారం శంకుస్థాపన చేశారు. ప్రకాశ్‌నగర్ వంతెనను సందర్శించి మరమ్మతు పనులను పరిశీలించారు. రాష్ట్ర గిడ్డంగుల సంస్థ ఛైర్మన్ రాయల నాగేశ్వరరావు, కాంగ్రెస్ పార్టీ జిల్లా అధ్యక్షుడు పువ్వాళ్ల దుర్గాప్రసాద్, మేయర్ పునుకొల్లు నీరజ, మాజీ ఎమ్మెల్సీ బాలసాని లక్ష్మీనారాయణ, కార్పొరేటర్లు గజ్జెల లక్ష్మి, కమర్తపు మురళీ, మలీదు వెంకటేశ్వర్లు, వీవీపాలెం సొసైటీ అధ్యక్షుడు రావూరి సైదుబాబు, నాయకులు అధికారులు పాల్గొన్నారు.

కష్టపడి సాధించారు గురూ!

కూసుమంచి, నేలకొండపల్లి, న్యూస్‌టుడే: అవి ఆశయాలు ఎదురైనా... కంగిపోకుండా లక్ష్యం కోసం ప్రయత్నిస్తే విజయం సిద్ధిస్తుందని వీరందరినీ చూస్తే అర్థమవుతోంది. ఏళ్లుగా ఉపాధ్యాయ ఉద్యోగాల కోసం కష్టపడుతూ ఎన్నో పోటీ పరీక్షల్లో వైఫల్యం చెందారు. అయినా పట్టుదలతో చదివి అనుకున్న లక్ష్యాన్ని చేరారు. నేలకొండపల్లి మండలవ్యాప్తంగా పలు గ్రామాలకు చెందిన అభ్యర్థులు ఇటీవల వెలువడిన డీఎస్సీ ఎంపిక జాబితాల్లో పలు విభాగాల్లో ఉద్యోగాలు పొందారు. అప్పలనరసింహాపురం గ్రామానికి చెందిన గూటి వీరబాబు, కందుల సురేశ్, పైనంపల్లికి చెందిన చల్లగుండ్ల నరసింహారావు స్కూల్ అసిస్టెంట్ సాంఘికశాస్త్రం విభాగంలో, బోదులబండ గ్రామానికి చెందిన మరికంటి లక్ష్మణ్ స్కూల్ అసిస్టెంట్ బయాలజీ విభాగంలో, కోనాయిగూడెం గ్రామానికి చెందిన మేరె రామారావు, నేలకొండపల్లికి చెందిన లక్కం స్వాతి ఎస్జీటీగా, నేలకొండపల్లికి చెందిన లక్కం ఉషాలక్ష్మి ఇటీవల విడుదలైన గురుకుల పీడీ, పీఈటీగా ఉద్యోగాలు పొందారు. మంగ్గాపురంపల్లికి చెందిన సుధీర్ ఎస్జీటీగా ఉద్యోగం సాధించారు. వీరు దరూ గత డీఎస్సీల్లో స్వల్ప తేడాతో ఉద్యోగాలు కోల్పోవడం, ప్రభుత్వ విధాన నిర్ణయాలతో జాబితా తారుమారుతో ఉద్యోగాలు పొందలేకపోవడమూ జరిగింది. అప్పటి నుంచి ఆటుపోట్లను ఎదుర్కొని నేడు ప్రభుత్వ ఉద్యోగాలు సాధించి ఇతరులకు ఆదర్శంగా నిలిచారు. వీరిలో కందుల సురేశ్ ఇప్పటికే జేఎల్‌గా విధులు నిర్వహిస్తున్నారు. స్వాతి, ఉషాలక్ష్మి అక్కాచెల్లెళ్లు.



లక్కం స్వాతి · మరికంటి లక్ష్మణ్ · కొలికపొంగు సుధీర్



కందుల సురేశ్ · గూటి వీరబాబు · సత్యనారాయణ · నరసింహారావు · మేరె రామారావు · లక్కం ఉషాలక్ష్మి



నిత్యావసరాల పంపిణీ

ఖమ్మం కార్పొరేషన్, న్యూస్‌టుడే: నగరంలోని మున్నేరు వరద బాధితులకు మంత్రి తుమ్మల చొరవతో హైసియా, నిర్మాణ్, కాగ్నిజెంట్ ఫౌండేషన్ ఇండియా, హైదరాబాద్ సాఫ్ట్‌వేర్ సొల్యూషన్స్ వారి ఆధ్వర్యంలో వివిధ ఐటీ కంపెనీల సహకారంతో నిత్యావసర వస్తువుల పంపిణీ కొనసాగుతోంది. మహిళా కళాశాలలో గురువారం బాధితులకు వాటిని అందజేశారు. ఆయా సంస్థల ప్రతినిధులు, నగరపాలక సిబ్బంది రవి, అమన్ తదితరులు పాల్గొన్నారు.

అన్నదాన మండపానికి భూమిపూజ

ఖమ్మం సాంస్కృతికం, న్యూస్‌టుడే: శ్రీదివ్య మణికంఠ అన్నదాన సేవా సమితి ట్రస్టు ఆధ్వర్యంలో జరిగే నిత్యాన్నదాన కార్యక్రమానికి ముస్తఫానగర్‌లో గురువారం భూమిపూజ నిర్వహించారు. గురుస్వామి పాకతిల్లం నారాయణన్ నంబూద్రితో శాస్త్రోక్తంగా పూజాది కార్యక్రమాలు జరిపించారు. ట్రస్టు ఛైర్మన్ చిర్రా రవి, ట్రస్టు గౌరవ సలహాదారు టీవీ.పుల్లంరాజు, కార్యదర్శి పుట్టా మల్లికార్జున్, సభ్యులు పాల్గొన్నారు.

రాయల పర్యటన: నేలకొండపల్లి, న్యూస్‌టుడే: రాష్ట్ర గిడ్డంగుల సంస్థ ఛైర్మన్ రాయల నాగేశ్వరరావు గురువారం మండలంలో పర్యటించారు. కొరట్లగూడెంలో పసుపులేటి వెంకమ్మ కుటుంబ సభ్యుల్ని పరామర్శించారు. ఆరెగూడెంలో నాయకులు వడ్డె లక్ష్మయ్య దశదినకర్మకు హాజరయ్యారు. దుర్గాప్రసాద్, నాగరాజు, అంజని, నాగరాజు పాల్గొన్నారు.

జనం విరుల వనం

ఉత్సాహంగా సద్దుల బతుకమ్మ



కూసుమంచి: పెరికసింగారంలో బతుకమ్మ ఆడుతున్న మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి

చివరి రోజు సద్దుల బతుకమ్మ వేడుకలు నగరంలో వైభవంగా జరిగాయి. మహిళలు రంగురంగుల పూలతో అందమైన బతుకమ్మలను తయారు చేశారు. గురువారం రాత్రి కూడళ్లలో ఉంచి డీజే పాటలతో నృత్యాలు చేశారు. కాల్వొడ్డు మున్నేరు వంతెన వద్ద బతుకమ్మలు ఆడి, నిమజ్జనం చేసేందుకు ఏర్పాట్లు చేశారు. విద్యుత్తు దీప కాంతుల్లో మహిళలు, యువతులు సందడి చేశారు. నగరపాలక అధికారులు తాగునీరు, విద్యుత్తు సౌకర్యం కల్పించారు. గజ ఈతగాళ్లను అందుబాటులో ఉంచారు. పోలీసులు బందోబస్తు నిర్వహించారు. కాల్వొడ్డు, మున్నేరు వంతెనపై భారీగా ట్రాఫిక్ స్తంభించింది.

– న్యూస్‌టుడే బృందం



ఖమ్మం కాల్వొడ్డు మున్నేరు వంతెన వద్ద జన సందడి



విజయనగర్ కాలనీలో సద్దుల బతుకమ్మ వేడుకలు



ఖమ్మం గ్రామీణం: ఎంవీపాలెంలో బతుకమ్మ సంబురాలు



ఆరో డివిజన్‌లో ఉత్సాహంగా...



మధురానగర్ సాయిబాబా మందిరంలో...



బతుకమ్మల చుట్టూ చేరి ఆడుతున్న యువతులు



శ్రీవాసవీ కన్యకాపరమేశ్వరి ఆలయంలో దుర్గాదేవీగా అమ్మవారు

దుర్గాదేవీగా అమ్మవారి దర్శనం

ఖమ్మం సాంస్కృతికం, న్యూస్‌టుడే: దేవీ నవరాత్రి ఉత్సవాల్లో భాగంగా 8వ రోజు గురువారం అమ్మవారు దుర్గాదేవీ అవతారంలో దర్శనమిచ్చారు. శ్రీస్తంభాద్రి లక్ష్మీనర్సింహస్వామి దేవస్థానం, జమ్మిబండ(పారువేట స్థలం) వేదిక, గుట్టలబజారులోని శ్రీవాసవీ కన్యకాపరమేశ్వరి దేవాలయంలో అమ్మవారు దుర్గాదేవీ అలంకారంలో దర్శనమిచ్చారు. శ్రీస్తంభాద్రి దేవస్థానం ఆధ్వర్యంలో స్వామివారి పారువేట స్థలం జమ్మిబండ వద్ద 12న జరిగే విజయ దశమి పూజా కార్యక్రమానికి హాజరు కావాలని ఆలయ ఈఓ కొత్తూరు జగన్మోహన్‌రావు మంత్రి తుమ్మల నాగేశ్వరరావుకు ఆహ్వాన పత్రిక అందజేశారు.

కామేపల్లి: పండితాపురం కొత్తకాలనీ దుర్గాదేవి అమ్మవారి మండపం వద్ద ఎమ్మెల్యే కోరం కనకయ్య గురువారం ప్రత్యేక పూజలు చేశారు. అనంతరం అన్నదాన కార్యక్రమాన్ని ప్రారంభించారు. డీసీసీబీ డైరెక్టర్ మల్లిబాబు యాదవ్, ఫతేమహ్మద్, మహేశ్ పాల్గొన్నారు.

మాజీ మంత్రి అజయ్ పర్యటన

రఘునాథపాలెం, న్యూస్‌టుడే: రఘునాథపాలెం మండలంలో మాజీ మంత్రి పువ్వాడ అజయ్‌కుమార్ గురువారం పర్యటించారు. వి.వెంకటాయపాలెంలో మాజీ ఆత్మ కమిటీ డైరెక్టర్ బాణోతు కీమా తండ్రి చందా ఇటీవల మృతి చెందారు. ఆయన నివాసాన్ని సందర్శించి చందా చిత్రపటానికి నివాళులర్పించి కుటుంబాన్ని పరామర్శించారు. మంచుకొండలో భూక్యా రాము కుమారుడు అజయ్‌రాథోడ్, లక్ష్మీసౌందర్య దంపతులను ఆశీర్వదించారు. కార్యక్రమంలో భారాస జిల్లా నాయకులు ఆర్జేసీ కృష్ణ, కూరాకుల నాగభూషయ్య, బచ్చు విజయ్‌కుమార్, పగడాల నాగరాజు, గుత్తా రవికుమార్, భూక్యా లక్ష్మణ్‌నాయక్, మాదంశెట్టి హరిప్రసాద్, మెంటెం రామారావు, తదితరులు పాల్గొన్నారు.



మంచుకొండలో నూతన దంపతులను ఆశీర్వదిస్తున్న మాజీ మంత్రి అజయ్

పలువురికి పరామర్శ..

ఖమ్మం కార్పొరేషన్, న్యూస్‌టుడే: మాజీ మంత్రి పువ్వాడ అజయ్‌కుమార్ గురువారం ఖమ్మం నగరంలో పర్యటించారు. శ్రీనివాసనగర్, లెనిన్‌నగర్, ప్రకాష్‌నగర్‌లలో పర్యటించిన పలు కుటుంబాలను పరామర్శించారు. నాయకులు బచ్చు విజయ్‌కుమార్, పగడాల నాగరాజు తదితరులు ఉన్నారు.

బొప్పన గాంధీకి పలువురి నివాళి

ఖమ్మం కార్పొరేషన్, న్యూస్‌టుడే: నగరానికి చెందిన ప్రముఖ గ్రానైట్ వ్యాపారి బొప్పన గాంధీ మృతికి పలువురు నేతలు సంతాపం తెలిపారు. బ్యాంకు కాలనీలోని గురువారం ఆయన ఇంటికి వెళ్లి మృతదేహంపై పూలమాలలు వేసి నివాళులర్పించారు. మేయర్ పునుకొల్లు నీరజ కుటుంబ సభ్యులను పరామర్శించగా, మాజీ ఎంపీ నామా నాగేశ్వరరావు తన స్నేహితుడు బొప్పన గాంధీ పాడె మోశారు.



తన స్నేహితుడు గాంధీ పాడె మోస్తున్న నామా నాగేశ్వరరావు

విద్యారంగానికి 'నాగటి' విశేష సేవలు

ఖమ్మం విద్యావిభాగం, న్యూస్‌టుడే: యూటీఎఫ్ పూర్వ రాష్ట్ర అధ్యక్షుడు నాగటి నారాయణ ద్వితీయ వర్ధంతిని ఖమ్మంలోని జిల్లా కార్యాలయంలో గురువారం నిర్వహించారు. ఆయన చిత్రపటానికి జిల్లా ప్రధాన కార్యదర్శి పారుపల్లి నాగేశ్వరరావు పూలమాల వేసి నివాళులర్పించారు. విద్యారంగానికి నారాయణ విశేష సేవలు అందించారని కొనియాడారు. సీనియర్ నాయకులు జియావుద్దీన్, నర్సింహారావు, రాందాస్, జిల్లా అధ్యక్షుడు జీవీ నాగమల్లేశ్వరరావు, రాంబాబు, రంజాన్ పాల్గొన్నారు.



నాగటి నారాయణ చిత్రపటం వద్ద నివాళులర్పిస్తున్న నాయకులు జియావుద్దీన్, నాగేశ్వరరావు తదితరులు

తండ్రికి తలకొరివి పెట్టిన తనయ

ఖమ్మం అర్బన్, న్యూస్‌టుడే: శ్రీనగర్ కాలనీకి చెందిన కంభంపాటి వంశీకృష్ణ(45) అనారోగ్యంతో చికిత్స పొందుతూ గురువారం మృతి చెందాడు. అన్నం సేవాశ్రమంలో కొన్నేళ్లుగా సేవలందిస్తున్నారు. భార్య బ్రాహ్మణి, కుమార్తె ధృతి ఉన్నారు. వంశీకృష్ణ అంత్యక్రియలను పదేళ్ల కుమార్తె చేతుల మీదుగా నిర్వహించారు. అన్నం సేవాశ్రమ నిర్వాహకుడు అన్నం శ్రీనివాసరావు, సభ్యులు, బంధువులు పాల్గొన్నారు.

మల్లేపల్లిలో తల్లికి...

కూసుమంచి, న్యూస్‌టుడే: శతాధిక వృద్ధురాలైన తన తల్లి అంత్యక్రియలను ఆమె కుమార్తె నిర్వహించారు. మల్లేపల్లికి చెందిన ఏనుగంటి శేషయ్య, నాగరత్తమ్మ దంపతులకు సోమేశ్వరి ఏకైక కుమార్తె. కాగా శేషయ్య పదేళ్ల క్రితమే మృతి చెందగా మిర్యాలగూడెంలో ఉండే సోమేశ్వరి తన తల్లి నాగరత్తమ్మ(101) బాగోగులు చూసేది. బుధవారం రాత్రి వార్ధక్యంతో మృతి చెందగా ఆమె మృతదేహాన్ని స్వస్థలం మల్లేపల్లికి గురువారం ఉదయం తీసుకొచ్చి తానే అంత్యక్రియలు నిర్వహించింది.

రతన్ టాటా మృతికి న్యాయవాదుల సంతాపం

ఖమ్మం న్యాయవిభాగం, న్యూస్‌టుడే: రతన్ టాటా మరణం దేశానికి లోటని బార్ అసోసియేషన్ అధ్యక్షుడు నేరెళ్ల శ్రీనివాసరావు, ప్రధాన కార్యదర్శి చింతనిప్పు వెంకట్ అన్నారు. ఆయన మృతికి సంతాపంగా న్యాయవాదులు గురువారం శ్రద్ధాంజలి ఘటించారు. ఐలు రాష్ట్ర అధ్యక్షుడు కొల్లి సత్యనారాయణ, ఐఏఎల్ అధ్యక్షుడు షేక్ లతీఫ్, తెదేపా లీగల్ సెల్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి గొల్లపూడి రామారావు, భారాస లీగల్ సెల్ నాయకుడు బిచ్చాల తిరుమలరావు తదితరులు సంతాపం తెలిపారు.

ఖానాపురం హవేలి, న్యూస్‌టుడే: రతన్‌టాటా మృతికి తెదేపా నాయకులు గురువారం సంతాపం తెలిపారు. ఎన్టీఆర్ భవన్‌లో ఆయన చిత్రపటానికి పూలమాల వేసి నివాళులు అర్పించారు. కార్యక్రమంలో కేతినేని హరీశ్‌చంద్ర, కొండబాల కరుణాకర్, మల్లెంపాటి అప్పారావు, నాగార్జున శ్రీనివాస్, సీతారాములు, రవికుమార్ తదితరులు పాల్గొన్నారు.

చికిత్స పొందుతూ వ్యక్తి మృతి


తిరుమలాయపాలెం, న్యూస్‌టుడే: ఏలువారిగూడేనికి చెందిన మద్దికుంట్ల ఉపేందర్‌రెడ్డి(42) గత నెల 12న రోడ్డు ప్రమాదానికి గురయ్యాడు. ఖమ్మంలోని ఓ ప్రయివేటు ఆసుపత్రిలో చేర్పించారు. చికిత్స పొందుతూ గురువారం మృతి చెందాడు. పోలీసులు కేసు నమోదు చేశారు.

చోరీ ఘటనలో రిమాండ్

తిరుమలాయపాలెం, న్యూస్‌టుడే: కాకరవాయిలో ఈ నెల 4న జరిగిన చోరీ ఘటనలో నిందితుడైన అదే గ్రామానికి చెందిన దామర్ల గణేశ్‌ని పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. కొత్తపల్లి సత్యం, ఉపేంద్రల ఇళ్లలో చొరబడి చోరీకి పాల్పడ్డాడు. కేసు నమోదు చేసిన పోలీసులు నిందితున్ని గుర్తించి రిమాండ్‌కు తరలించినట్లు ఎస్సై జగదీశ్ తెలిపారు.

పేరుకు సచివాలయం.. తలుపులు లేని దైన్యం!

చెదలు తిని పూర్తిగా శిథిలమై వేలాడుతున్న తలుపులకు తాళాలు వేసేందుకు రఘునాథపాలెం మండలం బూడిదంపాడు గ్రామ పంచాయతీ కార్యాలయ సిబ్బంది నానా అవస్థలు పడుతున్నారు. 2012లో నిర్మించిన ఈ పంచాయతీ కార్యాలయ భవనం తలుపులు చెదల కారణంగా పూర్తిగా దెబ్బతిన్నాయి. ఓ వైపు ద్వారం తలుపులు పూర్తిగా వేయలేని పరిస్థితి ఏర్పడటంతో కార్యాలయంలోని ఇనుప బీరువాను అడ్డుపెట్టి రక్షణ ఏర్పాటు చేశారు. ప్రధాన ద్వారానికి వేలాడుతున్న తలుపులకు నిత్యం తాళాలు వేసేందుకు కసరత్తు చేయాల్సి వస్తోంది. దీనిపై పంచాయతీ కార్యదర్శి నాగమణిని ప్రశ్నించగా దెబ్బతిన్న ద్వారాలకు తలుపులు ఆర్డర్ పెట్టామని త్వరలోనే ఏర్పాటు చేస్తామన్నారు. – రఘునాథపాలెం, న్యూస్‌టుడే



చెదలు తిని వేలాడుతున్న ప్రధాన ద్వారం తలుపు



మరో ద్వారం వద్ద అడ్డు పెట్టిన బీరువా

రుణమాఫీ నిధులు విడుదల చేయాలి: పోటు

ఖమ్మం మామిళ్లగూడెం, న్యూస్‌టుడే: కాంగ్రెస్ ఇచ్చిన హామీ మేరకు రైతుకు రూ.2 లక్షలు రుణమాఫీని తక్షణమే విడుదల చేయాలని సీపీఐ జిల్లా కార్యదర్శి పోటు ప్రసాద్ డిమాండ్ చేశారు. గిరిప్రసాద్ భవన్‌లో ఖమ్మం గ్రామీణ మండల సీపీఐ సమితి సమావేశం చెరుకుపల్లి భాస్కర్ అధ్యక్షతన గురువారం నిర్వహించారు. సమావేశంలో సీపీఐ రాష్ట్ర కంట్రోల్ కమిషన్ ఛైర్మన్ మహ్మద్ మౌలానా, జిల్లా సహాయ కార్యదర్శి దండి సురేశ్, రాష్ట్ర సమితి సభ్యుడు సిద్దినేని కర్ణకుమార్, జిల్లా కార్యవర్గ సభ్యులు అజ్మీరా రామ్మూర్తి, మిడికంటి వెంకటరెడ్డి, సుధాకర్ పాల్గొన్నారు.

☆ ఇటీవలి వరదలతో నష్టపోయిన బాధితులకు ప్రభుత్వం పరిహారం చెల్లించాలని అఖిలపక్ష పార్టీల జిల్లా నేతలు డిమాండ్ చేశారు. సీపీఎం మూడో పట్టణ కమిటీ ఆధ్వర్యంలో నగరంలోని ఎంఎస్ఆర్ వేడుకల మందిరంలో గురువారం రౌండ్ టేబుల్ సమావేశం నిర్వహించారు. సీపీఎం రాష్ట్ర కమిటీ సభ్యుడు యర్రా శ్రీకాంత్ అధ్యక్షతన జరిగిన సమావేశానికి సీపీఐ, సీపీఎం, సీపీఐ(ఎంఎల్) మాస్‌లైన్, భారాస జిల్లా నేతలు హాజరై మాట్లాడారు. 16న ఖమ్మం అర్బన్ తహసీల్దారు కార్యాలయం వద్ద జరిగే ధర్నాను జయప్రదం చేయాలని కోరారు. సీపీఎం జిల్లా కార్యదర్శి నున్నా నాగేశ్వరరావు, భారాస జిల్లా నాయకుడు గుండాల కృష్ణ, మాస్‌లైన్ జిల్లా కార్యదర్శి గోకినపల్లి వెంకటేశ్వరరావు, సీపీఐ జిల్లా నాయకుడు నూనె శశిధర్, వామపక్ష పార్టీల నాయకులు వై.విక్రమ్, యర్రా శ్రీనివాసరావు, ఝాన్సీ, వీరభద్రం తదితరులు పాల్గొన్నారు.